


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 23-09-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 48 సంచిక : 13 పేజీలు : 08 వెల : 1 రూపాయి

ప్రజలు బలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం వల్లే ఇది

# సాధ్యమైంది



దిల్లీ : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు కు పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఇది సాధారణ చట్టం కాదని.. నవ భారత ప్రజాస్వామ్య నిబద్ధతకు నిదర్శనమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేంద్రంలో సంపూర్ణ మెజారిటీతో బలమైన ప్రభుత్వం ఆవశ్యకతను చాటిచెప్పిన ప్రధాని.. దీని ద్వారానే ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న బిల్లు ఆమోదం పొందిందన్నారు. ఈ నేపథ్యంలో 'భాజపా మహిళా మోర్చా' సత్కార కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మహిళా నేతలకు వినమ్రంగా నమస్కరించారు.

'మహిళలకు రిజర్వేషన్ల అంశం దాదాపు మూడు దశాబ్దాలుగా నానుతూ వచ్చింది. గత పాలకులకు ఈ బిల్లుపై చిత్తశుద్ధి కరవైంది. అయితే, భాజపా ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేసింది. ఈ క్రమంలోనే దశాబ్ద కాలంలో మహిళలు ఒక శక్తిగా ఎదిగారు.

అందుకే.. గతంలో పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతులను చింపేసిన రాజకీయ పార్టీలే నేడు మద్దతివ్వాల్సి వచ్చింది' అని ప్రధాని మోదీ అన్నారు. పూర్తి మెజారిటీ ఉన్న బలమైన, స్థిరమైన, నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవడం వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. మహిళల భద్రత, గౌరవం, సంక్షేమం కోసం పదేళ్ల కాలంలో వివిధ

తరువాయి 2లో..

## చంద్రుడిపై విక్రమ్, ప్రజ్ఞాన్ పునరుద్ధరణ నేటికి వాయిదా



బెంగళూరు: చంద్రుడిపై స్లీప్ మోడ్‌లో ఉన్న చంద్రయాన్-3 కు సంబంధించిన విక్రమ్ ల్యాండర్, రోవర్ ప్రజ్ఞాన్‌ను పునరుద్ధరించే ప్రణాళికలను శనివారానికి వాయిదా వేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. తొలుత శుక్రవారం సాయంత్రం ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివేట్ చేయాలని భావించినట్లు స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ దేశాయ్ తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల దీనిని సెప్టెంబర్ 23న చేపడతామని చెప్పారు.

కాగా, ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూన్ ప్రాజెక్ట్ చంద్రయాన్-3 విజయవంతమైన సంగతి తెలిసిందే. ఆగస్ట్ 23న చంద్రుడి దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండ్ అయ్యింది. దీంతో అక్కడ అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ల్యాండర్ నుంచి చంద్రుడి ఉపరితలంపైకి దిగిన రోవర్ సుమారు 105 మీటర్ల దూరం వరకు కదిలింది.

మరోవైపు చంద్రుడిపై లూనార్ నైట్ ప్రారంభం కావడంతో సెప్టెంబర్ 2న రోవర్‌ను, 4న ల్యాండర్‌ను స్లీప్ మోడ్‌లో ఇస్రో ఉంచింది. అయితే శుక్రవారం నుంచి

తరువాయి 2లో..



చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన

# ఎపి హైకోర్టు

రెండ్రోజుల సీఐడీ కస్టడీకి చంద్రబాబు

ఇది నా బాధ.. ఆవేదన.. ఆక్రందన: న్యాయమూర్తితో చంద్రబాబు

అమరావతి, (విజయభాను న్యూస్) : ఎపి స్కిల్ డెవలప్ మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను ఎపి హైకోర్టు కొట్టివేసింది. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టుగా ఉన్నత న్యాయస్థానం ఏకవాక్యంలో తీర్పును వెల్లడించింది. సిఐడి తరపున సుప్రీంకోర్టు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదించారు. ఇరు వర్గాల వాదనలు నాలుగు రోజుల క్రితమే ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టుగా ఎపి హైకోర్టు ప్రకటించింది. అయితే ఈ పిటిషన్ పై శుక్రవారం తీర్పును వెల్లడించింది. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఎపి స్కిల్ డెవలప్ మెంట్ స్కాంలో తనపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేయాలని, రిమాండ్ ను రద్దు చేయాలని కోరుతూ ... ఎపి హైకోర్టులో ఈ నెల 13వ తేదీన చంద్రబాబునాయుడు క్వాష్ పిటిషన్ ను దాఖలు చేశారు. క్వాష్ పిటిషన్ లో పలు అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17 ఏ ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోవాలని కోరారు. ఈ క్వాష్ పిటిషన్ పై హరీష్ సాల్వే, సిద్దార్థ్ లూత్రా చంద్రబాబు తరపున వాదించారు. నాలుగురోజుల క్రితమే వాదనలు ముగియగా.. ఈరోజు సిఐడి వాదనలతో ఏకీభవిస్తూ ఉన్నత న్యాయస్థానం తాజా తీర్పును వెలువరించింది.

**ఇది నా బాధ.. ఆవేదన.. ఆక్రందన: న్యాయమూర్తితో చంద్రబాబు**

జైలులో ఉంచి తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని తెదేపా అధినేత చంద్రబాబు ఏసీబీ కోర్టు న్యాయమూర్తికి తెలిపారు. తన హక్కులను రక్షించాలని.. న్యాయాన్ని కాపాడాలని ఆయన కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన చంద్రబాబు రిమాండ్ ముగియడంతో పోలీసులు ఆయన్ను వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచారు.

ఈ సందర్భంగా కస్టడీపై న్యాయమూర్తి చంద్రబాబు అభిప్రాయాన్ని కోరారు. "45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితం నాది. నోటీసు ఇవ్వకుండా నన్ను అరెస్ట్ చేశారు. నా తప్పు ఉంటే విచారణ చేసి అరెస్ట్ చేయాల్సింది. నేను చేసిన అభివృద్ధి తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తుంది. అన్యాయంగా అరెస్ట్ చేశారు. ఇది నా బాధ.. నా ఆవేదన.. నా ఆక్రందన. ఈ వయసులో నాకు పెద్ద పనిష్మెంట్ ఇచ్చారు. నాపై ఉన్నవి ఆరోపణలు మాత్రమే.. అవి నిర్ధారణ కాలేదు. చట్టం ముందు అందరూ సమానమే .. చట్టాన్ని గౌరవిస్తా. న్యాయం గెలవాలి" అని చంద్రబాబు

తరువాయి 2లో..

## ఏపీలో మద్యం అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతాం



విజయవాడ: రాష్ట్రంలో మద్యం అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతామని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి స్పష్టం చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన నరేంద్రమోదీ ఫొటో ఎగ్జిబిషన్‌ను పురంధేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అక్రమ మద్యం ద్వారా వైకాపా నాయకులు జేబులు నింపుకొంటున్నారని ఆరోపించారు. నరసాపురంలో మద్యం దుకాణాన్ని తనిఖీ చేసినప్పుడు నగదు లావాదేవీల్లో అక్రమాలు వెలుగు

తరువాయి 2లో..



రెండోరోజూ స్పీకర్ పోడియం వద్ద

## తెదేపా ఎమ్మెల్యేల నిరసన

అమరావతి, (విజయభాను న్యూస్) : తెదేపా అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు రెండో రోజూ శాసనసభలో ఆందోళనకు దిగారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. 'చంద్రబాబుపై అక్రమ కేసులు ఎత్తివేయాలి', 'సైకో పాలన నశించాలి' అంటూ నినదించారు. స్పీకర్ పోడియం వద్ద తెదేపా ఎమ్మెల్యేల నిరసనపై మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, అంబటి రాంబాబు మాట్లాడారు. సభలో నిరసన తెలిపేందుకు కొన్ని విధానాలు ఉంటాయని బుగ్గన అన్నారు. అంబటి మాట్లాడుతూ సీఎం జగన్, పాలన గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకోబోమని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ అంశంపై చర్చ జరుగుతుందని.. అందులో తెదేపా ఎమ్మెల్యేలు పాల్గొనాలని సూచించారు.

**ఇద్దరు తెదేపా ఎమ్మెల్యేల సస్పెన్షన్**

సభలో తెదేపా నిరసన నేపథ్యంలో ఇద్దరు తెదేపా ఎమ్మెల్యేలను స్పీకర్ తమ్మినేని సీతారామ్ సస్పెండ్ చేశారు. కింజరాపు అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్‌లను ఈ సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ చేసినట్లు ఆయన ప్రకటించారు.

గరుడ వాహనంపై

# మలయప్పస్వామి..

భక్త జనసంద్రంగా తిరుమల



తిరుపతి: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్స వాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఐదవ రోజు.. శుక్రవారం సాయంత్రం గరుడోత్సవం వైభవంగా మొదలైంది. గరుడవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి దర్శనం ఇచ్చారు. చిరు జల్లులతో వరుణుడు స్వాగతం పలికారు. తిరు వీధులు భక్తులతో నిండిపోయి.. గోవింద నామ స్మరణతో మారుమోగాయి. వేద పండితుల మంత్రాలు, భక్తుల గోవింద నామాలు , మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు, దేవతా మూర్తుల కళా రూపాలతో తుమ్మలగుంట క్షేత్రం ఆధ్యాత్మికతను సంత రించుకుంది. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన గరుడోత్సవం వైభవోపేతంగా

తరువాయి 2లో..

సనాతన ధర్మం వ్యాఖ్యలపై

## ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: సనాతన ధర్మం పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ కు సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నోటీసులు పంపింది. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా వంటి రోగాలతో ఉదయనిధి ఇటీవల పోల్చారు. సామాజిక ధర్మానికి సనాతన ధర్మం వ్యతిరేకమని, సనాతన ధర్మాన్ని సమూలంగా నిర్మూలించాలని అన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దుమారం రేపాయి. పలు స్టేషన్లలో ఫిర్యాదులు వచ్చాయి. ఆయన వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం ఉదయనిధితో పాటు తమిళనాడు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అనిరుద్ధ బోస్, బేల ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేస్తూ, వ్యాఖ్యలు చేసిన జ్యూరిస్‌డిక్షనల్ హైకోర్టును పిటిషనర్ ఆశ్రయించే ఆప్షన్

తరువాయి 2లో..






# పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి

-జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నియోజక వర్గాలకు చెందిన ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ కు సంబంధించి ఏఈఓర్వో , ఈఆర్వో ల స్థాయిలో నియోజకవర్గాలలో సమావేశాలను నిర్వహించడం జరిగిందని, ఆ నివేదికలకు అనుగునంగా జిల్లాలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1945 పోలింగ్ కేంద్రాలకి అదనంగా 27 పోలింగ్ స్టేషన్ లను

తరువాయి 2లో..

## నాగార్జున విశ్వవిద్యాలయం పాలకమండల సభ్యులుగా రక్షిత్ ఫార్మా గ్రూప్ చైర్మన్

### రామేశ్వరరావుకు అభినందనలు తెలిపిన జడ్పిటిసి పిఎస్ రాజు



పరవాడ:- రక్షిత్ ఫార్మా గ్రూప్ చైర్మన్ రామేశ్వరరావు ప్రతిస్టాత్మక నాగార్జునా విశ్వవిధ్యాలయం పాలకమండలి సభ్యులుగా నియమితులయ్యారు.. ఈ మేరకు పరవాడ జడ్పిటిసి సభ్యులు పి.ఎస్. రాజు హ్రుదయపూర్వక అభినందనలు తెలియపరిచారు. ఈ సందర్భంగా పరవాడ జడ్పిటిసి పిఎస్ రాజు మాట్లాడుతూ గ్రూప్ ఆఫ్ చైర్మన్ రామేశ్వరరావు గొప్ప విద్యావంతులని, ఆయన మంచితనం ఆయన సేవలను గుర్తించి నాగార్జున విశ్వ విద్యాలయం పాలక మండల సభ్యులుగా నియమించ బడడం గర్వించ దగ్గ విషయం అని కొనియాడారు.

## మల్లిఖార్జునకాలనీలో అన్నదానం



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో మల్లిఖార్జున కాలనీలో వినాయకుని మండపం వద్ద శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు ప్రారంభించారు. యువకులు ఉత్సవాల్లో ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో చల్లా జయరాం, పిచ్చుక శ్రీనివాసరావు, జినగం ఈశ్వరరావు, నల్లా శ్రీనివాసరావు, మున్నా, ఆసపు సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ మండపం పనులు ప్రారంభం



మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ 5 వ వార్డు పరిధి మధురవాడ వైయస్సార్ కాలనీ లో మాజీ మంత్రి భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అలాగే మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు ఆదేశాల మేరకు జేసిఎస్ ఇంచార్జ్ పోతిన సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్ఆర్ కాలనీలో కళ్యాణ మండపం పనులను ప్రారంభించారు. కార్యక్రమానికి కాలనీ నాయకులు 5 వార్డ్ ఎస్సీ సెల్ అధ్యక్షులు, 73 సచివాలయం కన్వీనర్ వంకర అప్పారావు, 5వార్డ్ మహిళ అధ్యక్షురాలు, 72 సచివాలయం కన్వీనర్ బండారు శివలక్ష్మి, డి.దేవా, డి.రాధా. ఎస్.అప్ప రాజు, చందు, పీటర్, కాలనీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకార కుటుంబానికి పరిహారం అందజేత

భీమునిపట్నం : విజయభాను న్యూస్ ఆగస్టు 22 న విశాఖ సముద్రంలోబోటు ప్రమాదంలో మృతి చెందిన మారుపల్లి అప్పన్న అనే మత్స్యకారుడు భార్య తోటమ్మ కు ఆంధ్రప్రదేశ్ మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ద్వారా అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యంలో నష్టపరిహారము రూ. 1,65,000 అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి మైలపల్లి నరసింహులు ఉపాధ్యక్షులు గుంటు దానయ్య, పుక్కళ్ళ ఈశ్వరరావు అసోసియేషన్ పెద్దలు సురపతి రాములు, యాగ శ్రీనివాస్, బడే ఎల్లాజీ , జీకే తదితరులు పాల్గొన్నారు.

## గరుడ వాహనంపై మలయప్పస్వామి..

సాగింది. సాయంత్రం 4 గంటల నుంచే చుట్టు ప్రక్కల ప్రాంతాలు, పక్క మండలాల నుంచి భక్తులు తుమ్మలగుంటకు అధికంగా తరలివచ్చారు. వాహన సేవ ముందు కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నిత్యం మూలమూర్తి అభరణాలైనా మకరకంఠి, సహాస్రనామ మాల, లక్ష్మీకాసుల హారాలను గరుడసేవలో అలంకరించారు. ఏడాది మొత్తంలో.. గరుడోత్సవం రోజు మాత్రమే ఆభరణాలు గర్భాలయం నుంచి బయటకు వస్తాయన్నది తెలిసిందే. మరోవైపు గ్యాలరీలలో రెండు లక్షల భక్తులు చేరినట్లు అంచనా. గరుడవాహన దర్శనం కోసం భక్తులు పోటీ పడ్డారు. గరుడవాహన దర్శనం కోసం రింగ్ రోడ్డుకు భక్త సంద్రం తరలి వచ్చింది.

గరుడోత్సవంలో జిల్లా కలెక్టర్

శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి గరుడ వాహన సేవలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించారు. ఇస్కాన్ ప్రతినిధులు ఆలయం వద్దకు చేరుకుని సారె సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

శ్రీవారికి సారె సమర్పణ

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడసేవ ప్రారంభానికి ముందు తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి శ్రీవారికి సారె తెచ్చారు. సుమారు వెయ్యి మంది గ్రామస్తులు పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పువ్వులు, పండ్లు తీసుకు వచ్చి స్వామి వారికి సమర్పించారు.

ఉదయం మోహినీ అవతారంలో నిత్య కళ్యాణ శోభితుడు

అంతకు ముందు ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఆ తర్వాత ఉదయం 7 గంటలకు కల్యాణ వెంకటేశ్వర స్వామి మోహినీ అవతారంలో పల్లకీపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనంకు వున్న ప్రత్యేకత ఏమంటే మోహినీ అవతారం లో వున్న స్వామి భక్తులను ఆకట్టుకునేలా వివిధ రకాల ఆభరణాలు ధరించి.. కుడి చేతిలో చిలుకను పట్టుకుని.. ముందు ఏర్పాటు చేసిన అద్దంలో ముఖాన్ని చూస్తూ వుంటారు. స్వామి వారి పల్లకీ సేవలో భక్తులు తరించి పునీతులయ్యారు.

బ్రహ్మోత్సవాల్లో

కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 7 గంటలకు గజవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

## ఏపీలో మద్యం అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతాం

చూశాయన్నారు. మధ్యాహ్నం సమయానికి రూ.లక్షల వరకు విక్రయాలు జరిగితే అందులో డిజిటల్ చెల్లింపులు జరిపింది కేవలం రూ.700 మాత్రమేనన్న విషయం బయటపడిందన్నారు. ప్రతి రోజు మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనధికారికంగా వైకాపా నాయకుల జేబుల్లోకి భారీ మొత్తాలు వెళ్తున్నాయనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజల జేబుల నుంచి డబ్బులు దోచుకుని ఉచితాలు ఇస్తున్నామనే దిశగా మాట్లాడటం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్థనీయం కాదన్నారు.

## టీడీపీ అధికారంలోకి రాగానే అవినీతి మంత్రులందర్ని జైలుకి పంపిస్తామం




అనకాపల్లి (విజయభాను న్యూస్) : టీడీపీ అధికారంలోకి రాగానే అవినీతి మంత్రులందర్ని జైలుకి పంపిస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం కశింకోట మండలం, కన్నూరుపాలెంలో నిర్వహించిన టీడీపి రిలే నిరాహారదీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల నుండీ దూరం చేయలేరన్నారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వగానే అవినీతి వైకాపా మంత్రులను జైలుకు పంపిస్తాం అని హెచ్చరించారు.

జగన్ రెడ్డి సైకోయిజానికి రాష్ట్రంలోనీ పారిశ్రామిక వేత్తలు పారిపోతున్నారు అని ఆరోపించారు.దసరా నుండీ విశాఖ రాజధాని అని ప్రకటించగానే విశాఖ ప్రజలలో భయం పట్టుకుందని, వారి ఆస్థులను జగన్ రెడ్డి దోచుకుంటాడు అని ప్రజలకు భయం వేస్తుందని ఆరోపించారు మాజీ ఎంపీపీ కుంద్రాపూ రాము నాయుడు మాట్లాడుతూ హిట్లర్ మాదిరి జగన్ పాలన సాగుతోందన్నారు.చివరికి హిట్లర్ మాదిరిగానే ప్రజల తో ఛీ కొట్టించుకుని పిచ్చి వాడిగా మిగిలిపోవడం ఖాయమన్నారు. కొద్ది రోజులు ఓపిక పడితే సైకో పాలన పోయి చంద్రబాబు పాలన వస్తుందని జ్యోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాయల మురళీ,ఉగ్గిన రమణ మూర్తి, గొంతిన శ్రీనివాసరావు, కుంద్రాపూ అక్కూ నాయుడు, ఎర్రి నాయుడు, యూనిట్ ఇంచార్జీ చుక్కా ప్రసాద్,వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, సిద్ది రెడ్డి శ్రీనివాసరావు, కడిమిశెట్టి నరసింగరావు,మాజీ వైస్ ఎంపీపీ చిరికి సన్యాసి నాయుడు, మెడిశెట్టి సన్యాసి నాయుడు, చరకం ఈశ్వరరావు, రెడ్డి సూరిబాబు, వర్రీ పోతురాజు, కలగా సోమేశ్వర రావు,ఎంపీటీసీ బుద్ది రెడ్డి అప్పడు, నైనంశెట్టి రమణ రావు, బుద్ది రెడ్డి గంగయ్య,రమేష్ సత్యనారాయణ, చేబోలు సూరిబాబు, పంచ గ్రామల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

### ప్రజలు బలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం వల్లే ఇది సాధ్యమైంది

పథకాలు ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం తెలిసిందే. అంతకుముందు రోజు లోక్‌సభలోనూ బిల్లుకు ఆమోదం లభించింది. మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడం పార్లమెంటరీ చరిత్రలో సువర్ణ ఘట్టమని ప్రధాని మోదీ అభివర్ణించారు.

### చంద్రుడిపై విక్రమ్, ప్రజ్ఞాన్ పునరుద్ధరణ నేటికి వాయిదా

చంద్రుడిపై తిరిగి లూనార్ డే ప్రారంభమైంది. దీంతో నిద్రావస్థలో ఉన్న ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివ్ చేసే చర్యలను శనివారానికి ఇస్రో వాయిదా వేసింది.

కాగా, లూనార్ నైట్ సందర్భంగా చంద్రుడి దక్షిణ ధృవం వద్ద ఉండే మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు, అక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఇవి తిరిగి పని చేస్తాయా అన్నది సందిగ్ధంగా మారింది. ఒకవేళ విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ తిరిగి పని చేస్తే భారత్ మరో చరిత్ర సృష్టించినట్లు అవుతుంది.

## ఆటల్లో బాలభాను విద్యార్థులు ఘనత



మురళీనగర్ **విజయభాను న్యూస్) :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా విభాగం లో జరుగుచున్న ఆటల పోటీలలో బాల భాను విద్యార్థిని విద్యార్థులు ఉత్తర నియోజకవర్గం నుండి జిల్లాస్థాయికు ఎంపిక కాబడ్డారు. యోగా నుండి అండర్ 17 ఏజ్ గ్రూప్ బాలికల విభాగంలో ఎస్ హెచ్ హిమాంబి, అండర్ 14 నుంచి లక్ష్మి, అమృత ,ముత్య, ఎంపికైనారు. బాలికల విభాగంలో 400 మీటర్స్ రన్ పి.విద్యా ప్రజాపతి మొదటి స్థానంలో ఉన్నది. బాలుర విభాగంలో 400 మీటర్స్ రన్ వీ .రోహిత్ మొదటి స్థానము 200 రన్ ఎం రోహిత్ సాయి సూర్య ద్వితీయ స్థానము గెలుపొందినారు. క్రీడాకారులను బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ బి ఆర్ కే రాజుగారు ప్రిన్సిపల్ ఎస్వి శుభశ్రీ గారు మరియు వైస్ ప్రిన్సిపల్ టీ మనోరమణి గారు వ్యాయామ సంచాలకులు సిహెచ్ రమణారావు గారు ఉపాధ్యాయులు అభినందించినారు.





## పెట్రోల్ బంక్ నిర్మాణం విరమించాలి




మధురవాడ (విజయభాను న్యూస్) : పూర్వీకులు స్థాపించిన మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని కూల్చి పెట్రోల్ బంక్ నిర్మించాలన్న ప్రతిపాదన విడనాడాలని సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేసారు. శుక్రవారం మధురవాడ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ భవన సముదాయం 2007 లో మధురవాడ సర్వే సంఖ్య 151 లో నిర్మించామని, ఇప్పుడు ఆ భవనాన్ని కూల్చి ఆ స్థానంలో నూతనంగా పెట్రోల్ బంక్ నిర్మిస్తామని గురువారం సహకార అధికారులు వచ్చి కొలతలు తీసుకొని వెళ్ళారని ఇది పూర్తిగా సహకార స్ఫూర్తికి విరుద్దమని ఆవేదన వ్యక్తం అన్నారు. ఈ వాణిజ్య సముదాయం నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కృషి చేసారని గుర్తు చేసారు. కేంద్రం ప్రభుత్వం ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని అభివృద్ధి లో ఉన్న పి.ఎ.సి.ఎస్ ని క్రెడిట్ సొసైటీ గా మార్చి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ అంశం స్థానిక శాసనసభ్యులు అవంతి దృష్టికి తీసుకువెళ్తామని అలాగే అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన వారితో చర్చించి ఈ సొసైటీని కాపాడుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు సిపిఐ నాయకులు కొల్లి మేఘూరావు, పెంటపల్లి కాంతమ్మ, వి.సత్యనారాయణ, ఎం.డి బేగం జి. వేళంగినిరావు, ఎం.ఎస్ పాత్రుడు, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి

ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 212 పోలింగ్ కేంద్రాలలో లొకేషన్ మార్పిడి , 157 కేంద్రాలలో పేరు మార్పులు , 31 కేంద్రాల తొలగింపు చేసినట్లు తెలిపారు . రేషనలైజేషన్ ప్రక్రియ తరువాత మొత్తం 1941 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ సూచనలు ప్రకారం పోలింగ్ స్టేషన్లో ఉండవలసిన మాలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బిల్డింగ్ పాడైన చోట , సౌకర్యాలు లేని చోట లొకేషన్ మార్పులు చేసినట్లు తెలిపారు. రెండు కిలోమీటర్ల దూరం మించితే కొత్త కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొన్ని కేంద్రాలలో పేరు మార్పులు చేశామని తెలియజేసారు.

ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు ఒక్కో పోలింగ్ స్టేషన్ కి 1500 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అర్బన్ పరిధిలో ఒకే చోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలు లేకుండా ఉండేటట్లు మార్పులు చేశామని అన్నారు. అక్టోబర్ 17 న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె మోహన్ కుమార్ , భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, వై.ఎస్.ఆర్ సి పి , టిడిపి, బిజెపి, కాంగ్రెస్ , బి ఎస్ పి , సిపిఎం, ఆప్ ఇతర పార్టీ ప్రతి నిధులు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

### సనాతన ధర్మం వ్యాఖ్యలపై ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీం నోటీసులు

ఉందన్నారు. "ఇక్కడే (సుప్రీంకోర్టు) పిటిషన్ ఎందుకు? మీరు హైకోర్టుకు వెళ్లండి. మీరు ఎఫ్ఐఆర్ నమోదు చేయమని కోర్టును కోరారు. అత్యున్నత న్యాయస్థానాన్ని పోలీస్ స్టేషన్‌గా మారుస్తున్నట్టు కనిపిస్తోంది. పిటిషన్ అభ్యర్థనపై నిర్ణయం తీసుకునే అధికారం హైకోర్టుకు కూడా ఉంది" అని బెంచ్ పేర్కొంది. దీనిపై పిటిషనర్ తరఫు సీనియర్ లాయర్ కోర్టుకు వివరణ ఇస్తూ, విద్వేష ప్రసంగాలకు సంబంధించిన పలు పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.

కాగా, ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల అనంతరం కూడా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడానికి అంగీకరించలేదు. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని, పర్యవసనాలను ఎదుర్కొనేందుకు సిద్ధమేనని అన్నారు.

### చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన ఏపి హైకోర్టు

న్యాయమూర్తితో చెప్పారు.

అనంతరం చంద్రబాబుతో న్యాయమూర్తి మాట్లాడుతూ "మీరు పోలీసు కస్టడీలో లేరు.. జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. మీరు దీన్ని శిక్షగా భావించొద్దు. మీపై వచ్చినవి ఆరోపణలు మాత్రమే.. నేరనిరూపణ కాలేదు. చట్టం, నిబంధనల ప్రకారమే మీకు రిమాండ్ విధించాం. జైలులో సౌకర్యాల విషయంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? సౌకర్యాలు అవసరమైతే దానికి అనుగుణంగా ఆదేశిస్తాం. మీరు 24 వరకు జ్యుడిషియల్ కస్టడీలోనే ఉంటారు. మిమ్మల్ని కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అడుగుతోంది. మీ తరఫు న్యాయవాదులు కస్టడీ అవసరం లేదని వాదించారు. చట్టం ముందు అందరూ సమానమే" అని చెప్పారు.

# వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

## - వైవీ సుబ్బారెడ్డికి వీఏడబ్ల్యూజేహెచ్ఎస్ సభ్యుల వినతి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వర్కింగ్ జర్నలిస్టు లందరికీ ఇళ్ల స్థలాల్ని కేటాయించాలని కోరుతూ 'విశాఖ అక్రిడియేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ' (వీఏడబ్ల్యూహెచ్ఎస్) సభ్యులు వైసీపీ రీజనల్ కో -ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులు ఎన్నో ఒడిదుడుకులెదుర్కొంటూ మీడియా రంగంలో రాణిస్తున్నారని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయింపు డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు బి. రవి కాంత్, కార్యదర్శి యర్రా శ్రీనివాస్ సారథ్యంలో పలువురు మీడియా ప్రతినిధులు సర్క్యూట్ హౌస్‌లో వైవీని కలుసుకుని సమస్యను వివరించారు. 2006 నుంచి 2023వరకూ ఉన్న అక్రిడియేటెడ్ జర్నలిస్టు లందరికీ ఇళ్ళ స్థలాలివ్వాలని కోరారు. సుమారు 18ఏళ్లగా విశాఖలో జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయింపు జరగలేదని వివరించారు. వైసీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో జర్నలిస్టులకిచ్చిన హామీని ఆచరణలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ ప్రతినిధుల డిమాండ్‌పై వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు.

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయింపు జరుగుతుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ విషయంలో సానుకూలంగా ఉన్నారని తెలిపారు. విశాఖలో జర్నలిస్ట్‌లకు స్థల కేటాయింపుపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. త్వరలోనే అందరికీ ఓ శుభవార్త చెబుతామన్నారు.

వైవీని కలిసిన వారిలో సొసైటీ గౌరవాధ్యక్షులు జి.జనార్దనరావు, సలహాదారు పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పి. రామకృష్ణ, కె. పరశురాం, సహాయ కార్యదర్శులు ఎస్. అనూరాధ, ఎం.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి. రవికుమార్, పీఏ రావు, సీనియర్ జర్నలిస్టు కీర్తన్, ఎస్‌కేబీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గీతంతో అరవిందో ఫార్మా ఎంఓయు

## ఎమ్‌డిపి శిక్షణ కార్యక్రమాల పై దృష్టి




సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్)** : ప్రముఖ ఔషధ పరిశ్రమ అరవిందో ఫార్మా లిమిటెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తులకు ప్రత్యేక మేనేజ్‌మెంట్ డవలప్‌మెంట్ కార్యక్రమాలను (ఎమ్‌డిపి) నిర్వహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అరవిందో ఫార్మా సీనియర్ ఉపాధ్యక్షుడు (మానవ వనరుల విభాగం) యు.ఎన్.బి.రాజు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావులు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్‌తరన్‌దాస్ ల సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా గీతం ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ ఔషధ రంగంలో కాలనుగుణ మార్పులు, నూతన అంశాలు, నిబంధనలపై నిరంతర శిక్షణ ద్వారా అవగాహన పెరుగుతుందన్నారు. పరిశ్రమలతో మెరుగైన సంబంధాలకు గీతం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అరవిందోఫార్మా సీనియర్ ఉపాధ్యక్షుడు యు.ఎన్.బి.రాజు మాట్లాడుతూ గత ఏడాది తమ సంస్థలో పనిచేస్తున్న సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిపుణులు ఇచ్చిన శిక్షణ విజయవంతం కావడంతో సంస్థలోని ఇతర ఉద్యోగులకు గీతం ద్వారా ఆరోఅస్త్ర పేరిట ఎమ్‌డిపి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గీతంతో తమ అనుబంధం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గీతం కన్సల్టెన్సీ మరియు కొలాబరేషన్స్ డిప్యూటీ డైరక్టర్ సోంభట్‌శాస్త్రి, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్‌లు, డాక్టర్ సుధాకర్, డాక్టర్ జి.శ్రీలలిత, అరవిందో ఫార్మా జనరల్ మేనేజర్ సుహస్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగవ వార్డ్ టి డి పి నాయకులు నిరాహారదీక్షలు




భీమునిపట్నం : విజయభాను న్యూస్ భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని అక్రమ కేసులో రిమాండ్ విధించి రిమాండ్ కాలం పూర్తవతుండగా మరల రెండు రోజులు రిమాండ్ పొడిగించే విధానాన్ని వ్యతిరేకిస్తూ తక్షణమే ఆయన్ని తప్పుడు కేసు నుంచి విముక్తులను చేయాలని తెలుగుదేశం పార్టీ తరఫున డిమాండ్ చేస్తూ నారా చంద్రబాబునాయుడు కి సంఘీభావం తెలుపుతూ చేస్తున్న నిరాహారదీక్ష శుక్రవారం నాటికి 13 వ రోజుకు చేరుకుంది . అందులో భాగంగా ఈరోజు భీమిలి నియోజకవర్గం పరిధి లో జీవీఎంసీ 4 వ వార్డు ముఖ్య నాయకులతో నిరాహార దీక్ష శిబిరాన్ని నిర్వహించి బాబుతో మేము అనే పోస్టర్లను ప్రదర్శిస్తూ బాబు కి భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు అధ్యక్షతన సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గంట నూకరాజు, నాలుగవ వార్డ్ పార్టీ అధ్యక్షులు పాసి నర్సింగ రావు, జీవీఎంసీ రెండో వార్డ్ కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు పాసి త్రినాథ్ కుమార్ , దంతులూరి సిద్ధార్థ వర్మ , గుండు గోవిందరావు (చిన్నబాబు) , అంగటి రాము, కనకల అప్పలనాయుడు మోటూరి కనక రత్నం, గజ్జి రాజు, మైలిపల్లి రాము , వాసుపల్లి పోలమ్మ , వాసుపల్లి ఎల్లయ్య , పోతిని శివ , తొత్తడి సూర్య , కొక్కిరి అప్పన్న , కంచర్ల కామేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత దంత వైద్య శిభిరం



ఆనందపురం : విజయభాను న్యూస్ : ఆనందపురం మండలం, నీలకుండీలు జంక్షన్ లో శుక్రవారం అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల వారిచే, ఉచిత దంత వైద్య శిభిరం ఏర్పాటుచేశారు .ఇందులో భాగంగా ప్రజలకు వారియొక్క దంత సమస్యలను తనిఖీ చేసి వారియొక్క దంత సమస్యలను పరిష్కరించారు. ఇందులో 150 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లెంక రాంబాబు,మరియు ఎంపీటీసీలోకిరెడ్డి అచ్చిరెడ్డి,మాజీ ఎంపీటీసీ కోరాడ వెంకటరమణ వైద్యులు డాక్టర్ ఆర్ యస్వంత్, సాయికృష్ణ, పి. ఆర్.ఓ ఎన్ శ్రీనివాసు.హౌస్ సర్జన్స్ కె. షైనీ, కె యమున, ఎం. నిఖిల, ఎం. మహితా.తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన

## అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లికార్జున

## కార్యక్రమంలో 60 అర్జీలు



మధురవాడ (విజయభాను న్యూస్) : జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.. ఏ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. శుక్రవారం విశాఖ రూరల్ మండలం పరిధి,

6 వ వార్డు లోగల పీ.ఎం.పాలెం, అవంతి ఫంక్షన్ హాల్ లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించారు. విశాఖ రూరల్ మండల పరిధిలో ఉన్న గ్రామ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా ప్రతి సోమవారం జిల్లా ప్రధాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిందని చెప్పారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 8వ తేది నుండి అక్టోబర్ 13 వ తేది వరకు బుధ, శుక్రవారాల్లో రెండు రోజులలో మండల కేంద్రాలలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో గల ప్రతి మండలంలో జరిగే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్దేశిత తేదీలలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా ఈరోజు విశాఖ రూరల్ మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం (స్పందన) నిర్వహించామని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి శ్రద్ధతో ఉండాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పూర్తిగా పరిశీలించి సరైన సమాధానం ఇవ్వాలని అన్నారు. ఇప్పుడు ఇచ్చిన అర్జీలను జెకేసి పోర్టల్ నందు అప్లోడ్ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి అధికారి తమ శాఖ కు చెందిన అన్ని అర్జీలు పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని తెలిపారు. విభాగాధిపతులందరూ ఈ కార్యక్రమం పై పూర్తి శ్రద్ధ వహించి పనిచేయాలన్నారు. వచ్చిన అర్జీలలో ప్రధానంగా రెవెన్యూ, జివిఎంసి , హౌసింగ్ , ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్ , ఆర్డిఓ భాస్కర్ రెడ్డి, జివియంసి అడిషనల్ కమిషనర్ వర్మ, ఎంఆర్ఓ సనపాల రమణయ్య, విద్యుత్ శాఖ ఈఈ పోలాకి శ్రీనివాసరావు, మధురవాడ సబ్ రిజిస్టర్ ఎస్. మోహనరావు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా , డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ఆకాంక్ష మేరకే విశాఖ నుండి పాలన



అనకాపల్లి (విజయభాను న్యూస్) : దసరా నుండి విశాఖపట్నం ను రాజధానిగా చేసుకుని పాలన కొనసాగించడం జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం ఉత్తరాంధ్ర ప్రజల అదృష్టమని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు శుక్రవారం నెహ్రూ చౌక్ లో వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు విశాఖ నుండి పాలన ప్రారంభం కావడానికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ప్రార్ధించారు ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత ఎన్ని చంద్రబాబు నాయుడు ఎన్ని కుట్రలు పన్నినా జగన్మోహన్ రెడ్డి విశాఖ నుండి పాలన కొనసాగించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఇప్పటికే అన్ని కార్యాలయాలను విశాఖకు తరలించాలని ఆదేశించడం జరిగిందన్నారు విశాఖ రాజధాని కాకుండా ఎన్ని అడ్డదారులు తొక్కిన ప్రజల ఆకాంక్ష మేరకు విశాఖ నుండి పాలన సాగించాలని నిర్ణయించటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు పెద్ద ఎత్తున జగన్మోహన్ రెడ్డికి అనుగుణంగా నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు మాట్లాడుతూ ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు ఇప్పటికీ మంత్రి అమర్నాథ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు రాజధాని అయిన వెంటనే మరింత అభివృద్ధి సాధించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో నూకాంబికా దేవస్థానం ఛైర్మన్ కొణతాల మురళీ కృష్ణ,భోగలింగేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ ఆళ్ళ నాగేశ్వర రావు,మలశాల కిషోర్, జాజుల రమేష్ సూరిశెట్టి రమణ అప్పారావు మురళీకృష్ణ గైపూరి రాజు ఆడారి శ్రీను ఏడువాకర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా లక్ష్మి వాణి పాలెంలో దీపారాధన



మధురవాడ (విజయభాను న్యూస్) : మహావిశాఖ జోన్ 2 పరిధి 6వ వార్డు పిఎం పాలెం లక్ష్మి వాణి పాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం సాయిబాబా గుడి వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద లక్ష వత్తుల దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పిల్లలు పెద్దలు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

దీపారాధనలో పోతిన చంటి, బంక ఏల్లారావు, పోతిన ఏళ్ళజి, పోతిన ప్రసాద్, వాంద్రాసి సన్యాసి రావు, పోతిన నర్సింగ్ రావు, వాంద్రాసి భాస్కర రావు, శాన్ చిన రవణ, కాటుపిల్లి అప్పన్న, కాటుపిల్లి సురేష్, వాంద్రాసి శ్రీను, పోతిన రాజు, పోతిన అనిల్ తదితరులు పాల్గొన్నారు.



జగనన్నవిశాఖ దక్షిణ నియోజకవర్గం 35 వ వార్డులో ఎంతో చారిత్రక పేరు ప్రఖ్యాతలుగాంచిన పూర్ణ మార్కెట్ వర్తక సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవలు సందర్భంగా మహా దేవదేవ దేవుని మహా గణపతిని దర్శించుకుని ప్రజలందరూ బాగుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన 35వ వార్డు కార్పొరేట్ ర్ పేదల పక్షపాతి విల్లూరి భాస్కరరావు ఈ పూజా కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తలు బత్తి మంగరాజు కాండ్రేగుల రూపవతి వర్తక సంఘం అసోసియేషన్ ప్రెసిడెంట్ సెక్రటరీ సభ్యులందరూ కూడా ఈ పూజా కార్యక్రమం పాల్గొన్నారు

# విజయభాను సంపాదకీయం

## భారత్ కెనడా విభేదాలు !

ఖలిస్థానీ ఉగ్రవాద నాయకుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల పాత్ర ఉందన్న నమ్మకమైన ఆరోపణలు (క్రెడిబుల్ ఎలిగేషన్స్) వచ్చాయని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆ దేశ పార్లమెంటులో ప్రకటించడంతో భారత్ కెనడాల మధ్య ప్రారంభమైన విభేదాలు అంతకంతకూ తీవ్రం కావడం ఆందోళనకరం. నిర్దిష్ట సమాచారం ఉంటే దాన్ని అందజేసి ద్వైపాక్షికంగానో లేక అంతర్జాతీయ న్యాయ వేదికల ద్వారానో పరిష్కరించుకోవాలి తప్ప భారత్‌పై నిందలు వేయడం కెనడాకు తగదు. దీంతో కెనడాలో చదువుకుంటున్న భారత విద్యార్థులు, ఇక్కడి వారి కుటుంబీకులు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రపంచంలో భారత్‌కు వెలుపల ఇంకే దేశం కన్నా అత్యధికంగా సిక్కులున్నది కెనడాలోనే గనుక ఈ వివాదాల మూలంగా ఇరు దేశాల్లోని సిక్కులకు సంబంధ బాంధవ్యాలు, సాంస్కృతిక పరంగా తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. కీలక సరిహద్దు రాష్ట్రమైన పంజాబ్ ప్రజల్లో ఇటువంటి గందరగోళం ఏర్పడితే దాని ప్రభావం దేశంపై ఎంతగానో ఉంటుంది. ముఖ్యంగా 70, 80వ దశకాల్లో అక్కడ తలెత్తిన ఉగ్రవాదం దేశ సమైక్యత, సమగ్రతలకు సవాల్‌గా మారిన విషయం మనందరికీ తెలుసు. ఆపరేషన్ బ్లూ స్టార్ తో అణచివేసినా ఆ తరువాత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ వెంటనే ఢిల్లీలో సిక్కుల ఊచకోత వంటివి భారత్‌కు ఎన్నటికీ మానని గాయాలే !

'ఖలిస్తానీ టైగర్ ఫోర్స్' అధ్యక్షుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ ఈ ఏడాది జూన్‌లో బ్రిటిష్ కొలంబియా లోని సర్రే ప్రాంతంలో హత్యకు గురి కాగా మరో ఉగ్రవాది సుఖా దుంకెన్ విన్నిపెగ్‌లో బుధవారం ప్రత్యర్థి గ్యాంగ్ జరిపిన దాడిలో మరణించాడు. కెనడా ప్రధాని ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా నిజ్జర్ హత్యకు ఇండియా కారణం అంటూ ఆరోపణలు చేయడమేగాక సీనియర్ భారత దౌత్యవేత్తను ఆ దేశం నుంచి బహిష్కరించారు. అందుకు ప్రతిగా భారత్ కూడా కెనడియన్ సీనియర్ దౌత్యవేత్తను ఐదు రోజుల్లో ఇండియా వదిలి వెళ్లాలని ఆదేశించింది. కెనడా ఆరోపణల్ని అసంబద్ధ, ప్రేరేపిత ఆరోపణలుగా ఖండించింది. నిజ్జర్ హత్యోదంతంలో తమకు ఎలాంటి నిర్దిష్ట సమాచారం అందించినా పరిశీలించేందుకు సిద్ధమని చెప్పినా ఇప్పటివరకూ కెనడా నుంచి అటువంటివి అందలేదని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. కెనడాలోని భారత పౌరులు, విద్యార్థులు, అక్కడకు ప్రయాణించాలనుకునేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారత ప్రభుత్వం తన పౌరులను హెచ్చరించింది. భారత్‌లో ఉంటున్న కెనడా పౌరులు జాగ్రత్తగా ఉండాలని ట్రూడో ప్రభుత్వం సలహా జారీ చేసిన కొన్ని గంటల్లోనే భారత్ ఈ ప్రకటన విడుదల చేసింది. కెనడా పౌరులకు భారతీయ వీసాలను సస్పెండ్ చేసింది. దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. నాటో, జి-7, ఫైవ్ ఐస్ తదితర కూటముల్లోని మిత్ర దేశాలైన అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి దేశాలను తనకు మద్దతుగా కూడదీసుకోవాలని కెనడా యత్నిస్తోంది. ట్రూడో ఆరోపణల్లో నిజాలు తేలాలంటే దర్యాప్తు జరగాలని, అందుకు భారత్ సహకరించాలని అమెరికా జాతీయ భద్రతా మండలి సమన్వయకర్త గురువారం సాయంత్రం ప్రకటించారు. మిగతా సంపన్న దేశాలు ఎలా వ్యవహరిస్తాయో భారత ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

కెనడా జనాభాలో సిక్కులు 2.1 శాతం కావడం, 30 మంది ట్రూడో మంత్రివర్గంలో నలుగురు సిక్కులు ఉండడం గమనార్హం. ఓట్ల పరంగానూ పార్టీలోనూ కీలకమైన పాత్ర కలిగినందునే అక్కడి సిక్కులను బుజ్జగించడానికి ట్రూడో ప్రభుత్వం భారత్ తో ఇంత ఘర్షణపూరిత వైఖరి ప్రదర్శిస్తోందన్న వాదన కాదనలేనిది. ఉగ్రవాదం పట్ల భారతీయుల్లో సహజంగానే ఉన్న వ్యతిరేకతను తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బిజెపి సంఘపరివార్ కు పరిపాటి. ఉగ్రవాదాన్ని ప్రతిఘటించే 56 అంగుళాల ఛాతీ గల నాయకుడంటూ వాట్సప్ యూనివర్సిటీ నుండి ఇప్పటికే కొన్ని పోస్టులు వెలువడుతున్నాయి. జాతీయ దురభిమానాన్ని రెచ్చగొట్టి ఓట్లు రాబట్టుకోవడం దానికి కొత్త కాదు. ఈ నేపథ్యంలో ఇరు దేశాధినేతలూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడితే నష్టపోయేది మాత్రం ప్రజలే! విభేదాలను విడనాడి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం రెండు దేశాలకూ శ్రేయస్కరం.

# జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల సత్వరం పరిష్కరించాలి

### నాణ్యతతో పరిష్కారానికి చర్యలు చేపట్టండి

### ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఎం నవీన్



శ్రీకాకుళం /పాతపట్నం, సెప్టెంబర్ 22:- అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఎం నవీన్ అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలను సావదానంగా వింటూ సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాతపట్నం తహాసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఇంచార్జ్ కలెక్టర్ ఎం నవీన్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులపై తక్షణ పరిష్కారానికై బుధవారం పాతపట్నం మండల కేంద్రంలో ఏర్పాటు చేసి జెకెసి వినతుల స్వీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలు తెలియజేస్తూ వినతి పత్రాలను అందించారు. ప్రధానంగా గుమ్మగడ్డకు గండ్లు పడ్డాయని వర్షాకాలంలో తమ పంట పొలాల్లోనికి వరద నీరు రావడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని స్థానిక రైతులు వినతి పత్రాలను అందించారు. అలాగే విద్యుత్ సమస్యలు, తాగునీరు, రహదారి సమస్యలు తెలియజేస్తూ పలువురు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అదనపు సూపరేంటెడెంట్ ఆఫ్ పోలీస్ విఠలేశ్వరరావు, డిఆర్డిఎ పథక సంచాలకులు డా. విద్యాసాగర్, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ వేంకటే రామన్, జిల్లా విద్యాశాఖధికారి వెంకటేశ్వర రావు, జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి అధికారులతో పాటు పాతపట్నం తహాసీల్దార్ కె.రవిచంద్ర మండల పలు శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘణంగా హిందీ దివస్ కార్యక్రమం



భీమునిపట్నం : విజయభాను న్యూస్ 74వ రాష్ట్ర భాష హిందీ దివస్ పక్షోత్సవాలు లో భాగం గా 9వ రోజు జీ వీ యం సీ 2వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాల. ఝాన్సీ లక్ష్మీ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణములో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. జయసుధ అధ్యక్షతన ఈ హిందీ దివస్ కార్యక్రమాన్ని అతి ఘనంగా నిర్వహించారు. ఈనాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు, గంటా నూకరాజు . అదే విధంగా విశిష్ఠ అతిథిగా ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు మరియు విశ్రాంత ప్రిన్సిపాల్ కాళ్ళ. సూర్య రామకృష్ణ లు పాల్గొన్నారు. ముందుగా జాతిపిత మరియు దక్షిణ భారత హిందీ ప్రచార సభ, చెన్నై వ్యవస్థాపక అధ్యక్షులైన మహాత్మా గాంధీ చిత్ర పటానికి గంటా నూక రాజు ఎన్. జయసుధ పూలమాలలు వేసి నివాళు లర్పించారు తదుపరి విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు మరియు హిందీ మాద్యామాలల్లో వ్యాసరచన పోటీలు " రాష్ట్ర భాష హిందీ నేర్చుకోవల్సిన ఆవశ్యకత " అనే అంశం పై నిర్వర్తించడమైనది. ఆ తరువాత హిందీభాష నేర్చుకొనుట వలన కలుగు లాభాలు అనే అంశం పై వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథ గంటా నూక రాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్ లో 151 ఎ అధికరణములో జాతీయ భాష హిందీ దివస్ పక్షోత్సవాలను ప్రతీ సంవత్సరము సెప్టెంబరు 14వ తేదీ నుండీ 29 తేదీ వరకు జరుపుకోవాలని నిర్దేశించడమైనది. 1949 సెప్టెంబరు 14వ తేదీన అప్పటి ప్రధాన మంత్రి శ్రీ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులైన కే.ఎస్.ఆర్ కృష్ణా రావ్ మాట్లాడుతూ జాతీయ భాష హిందీ నేర్చుకొనుట ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సంస్థలైన బ్యాంకింగు, రైల్వేలు, రక్షణ దళాలు లో హిందీ నేర్చుకున్న వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడును. ప్రధానోపాధ్యాయురాలైన ఎన్. జయసుధ మాట్లాడుతూ హిందీ తేలికైన భాష, మృదు మధురమైన భాష అని తెలిపారు. హిందీ నేర్చుకొనుట వల్ల దేశంలో అనేక ఉద్యోగ అవకాశాలు పొంద వచ్చునని తెలిపారు ఈ నాటి పోటీలలో విజేతలుగా నెగ్గిన వారికి ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ బహుమతులు ప్రతీ అంశంలోను ఉభయ భాషలలోను బహుమతులు ఈ నెల 29 న ప్రదానం చేస్తారని తెలిపారు

## కవి సమయం

# మనసు మాట వినదు

మనసుపై ఆధిపత్యం సాధించినవాడే విజయుడు
మానసిక చిత్తవృత్తులను నిరోధించటమే మహారాజయోగం
మనిషి నడవడిక మనసుపై ఆధారం
మనసే మనిషికి మకుటంలేని మహారాజు
స్పందించటం మనసు లక్షణం
నిలకడలేనితనం దీని దుర్గుణం
విసుగు, విరామం లేకుండా అవిశ్రాంతంగా
ఊసరవెల్లిలా దేహాన్ని, రూపాన్ని,
బుద్ధిని బట్టి లక్షణాలను మార్చుకుంటుంది
మనసు అనురక్తికి అంతు లేదు
మనిషిని కీలుబొమ్మను చేసి ఆడిస్తుంది
మనసుకు అభ్యాసాన్ని అలవరిస్తే,
దివ్యత్వాన్ని అందిస్తుంది
మనసుతోనే పరమాత్మను చూడగలం

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

| అష్టమి ఉ. 7.41 మూల ఉ. 11.43<br>వ.ఉ. 10.10ల 11.42 వ.రా. 8.53ల 10.24 | శనివారం<br>23-09-2023 |
|---|---|

a **మేషం** : కుటుంబ సమస్యలు, ఆర్థిక వ్యవహారాల పట్ల శ్రద్ధ వహిస్తారు. బ్యాంకు వ్యవహారాల్లో ధనం పట్ల, అపరిచితులతో మెళకువ అవసరం. కోల్పోయిన అవకాశం, వస్తువులు చేజిక్కించుకుంటారు. b **వృషభం** : ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. రాజకీయనాయకులకు ప్రయా ణాల్లో మెళకువ అవసరం. బ్యాంకు పనులు మందకొడిగా సాగుతాయి. ఆపద సమయంలో సన్నిహితులు అండగా నిలుస్తారు. ఆహార వ్యవహారాల్లో మెళ కువ అవసరం. సోదరీ, సోదరుల మధ్య అనురాగ వాత్సల్యాలు పొంద గలవు. C **మిథునం**: వైద్యులకు శస్త్ర చికిత్స చేయునప్పుడు ఏకాగ్రత అవ సరం. ఆలయ సందర్శనాలలో ఇబ్బం దులను ఎదుర్కొంటారు. నిరుద్యోగులకు ప్రముఖుల సహకారంతో సదవకాశాలు లభిస్తాయి. మీ శ్రీమతి సహాయం లేనిదే మీ సమస్యలు పరిష్కారం కావని గ్రహించండి. విద్యార్థులు ప్రేమ వ్యవహా రాలకు దూరంగా ఉండ టం మంచిది. d **కర్కాటకం** : ఖర్చులు పెరిగినా ఆర్థిక సంతృప్తి, ప్రయోజనం పొందుతారు. నిరు ద్యోగులకు ఇంటర్వ్యూ సమాచారం అందుతుంది. స్త్రీలకు ప్రతి విషయంలో ఓర్పు , నేర్పు అవసరమని గమనించండి. రాజకీయ రంగాల్లో వారు ప్రత్య ర్థుల వల్ల సమస్యలు ఎదుర్కొంటారు. e **సింహం** : ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. వస్త్ర, బంగారం, ఫ్యాన్సీ, మందులు, స్వీట్ షాపు వ్యాపారులకు పురోభివృద్ధి. విద్యార్థులకు అనుకోని చికాకులు ఎదురవుతాయి. రాజకీయాల్లో వారికి కార్యకర్తల వల్ల ఇబ్బందులు తప్పవు. ఆడిటర్లు, అకౌంట్స్ రంగాల వారికి ఒత్తిడి పెరుగుతుంది. f **కన్య** : మిత్రుల సహాయ సహకారాలు అందించడం వలన కొన్ని సమస్యలకు పరిష్కారమార్గం కానరాగలదు. ఇతరుల కారణంగా మీ పనులు, కార్యక్రమాలు వాయిదా పడటంతో నిరుత్సాహం తప్పదు. మీ మాటకు కుటుంబంలో విలువ పెరుగుతుంది. దంపతుల మధ్య మనస్పర్థలు చోటుచేసు కుంటాయి. g **తుల** : వ్యాపారాల్లో నిలదొక్కుకోవటానికి మరింతగా శ్రమించవలసి ఉంటుంది. పత్రికా, ప్రైవేట్ రంగాల వారికి ఆర్థిక ప్రగతితో కూడిన అవకాశాలు లభిస్తాయి. బంధువుల రాకతో మానసిక ఆందోళన తప్పదు. స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులు ఎదు ర్కొంటారు. h **వృశ్చికం** : ఆపరిష్కృతమై మీ సమ స్యలు పరిష్కార దిశగా పయ నిస్తాయి. రాబడికి మించి ఖర్చులు అధికమ వుతాయి. ప్రము ఖుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. సాంఘిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. శ్రీవారు, శ్రీమతి గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించే పరిణామాలు ఎదుర్కొంటారు. i **ధనుస్సు** :ఆర్థిక విషయాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. ఉద్యోగస్తులు పై అధికారులకు వివరణ ఇచ్చు కోవలసిన పరిస్థితులు నెలకొంటాయి. పెద్దల సలహాలను పాటించి మీ గౌరవాన్ని నిలబెట్టుకుంటారు. వ్యాపారాభివృద్ధికి చేయు కృషి సత్ఫలితాలను ఇస్తుంది. ధనం చేతిలో నిలబడటం కష్టం కావచ్చు. j **మకరం** :ఉపాధ్యా యులకు ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. వాతా వరణంలోని మార్పులు వల్ల మీ పనులు వాయిదా పడతాయి. పని పట్ల మరింత శ్రద్ధ, ఏకా గ్రత అవసరం. స్త్రీలకు అలం కారాలు, విలాసవస్తువుల పట్ల మక్కువ పెరుగుతుంది. మీ కళత్ర మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికి బాగా శ్రమిస్తారు. k **కుంభం** : కొత్త అనుభవం ఎదురైె నందుకు ఆనందించండి, వాహనం అమర్చుకోవాలనే మీ కోరిక నెరవేరు తుంది. విద్యార్థులకు మిత్ర బృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం క్షేమ దాయకం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. L **మీనం** : వ్యాపా రాలు మరింతగా పుంజు కుంటాయి. గృహానికి కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్ల విషయంలో పునారాలోచన మంచిది.

# బాబాను దర్శించిన యోగులు



## సంకీర్తన

శ్రీ చంద్రయోగి

ఆమె పెదనాన్న లక్ష్మీ నరసింహారావుగారు ఒకసారి శృంగేరీ పీఠాధిపతులను, వారి పరివారమును తమ ఇంటికి పిలిచి, ఆతిథ్యమివ్వాలని ఎంతో ప్రయత్నించి విఫలమయ్యారు. ఎంత ప్రార్థించినా వారు హైదరాబాద్ పరగణాలోకి రావటానికి అంగీకరించలేదు.

ఒకరోజు రాత్రి శారదాదేవీకి కలలో పెద్ద పెద్ద జడలు, గెడ్డము ఉన్న ఒకయోగి కనిపించి 'అమ్మాయీ! శంకరస్వామి మీ ఇంటికి తప్పక రాగలరు. మీ పెద్దనాన్నను స్వయంగా వెళ్ళి ఈసారి ఆహ్వానించమని చెప్పు. ఆయన తప్పక విచ్చేయగలరు. ఇది చంద్రయోగి ఆశీర్వాదము! ఈ విషయము నాన్నగారితో చెప్పు. నాకు నమస్కారము చేసుకొని నా దగ్గరకు రా..' అన్నారు. శారదాదేవి ఆయనతో 'నేను ఎక్కడకు రాను' అన్నది. అప్పుడు ఆ యోగి ఆ అమ్మాయి శిరస్సుపై హస్తము నుంచి 'నీవు వస్తావులే' అని చెప్పి వెళ్ళారు.

శారదాదేవి తండ్రితో ఈ స్వప్న వృత్తాంతమునంతా చెప్పింది. ఆ యోగి చెప్పినట్లే ఆమె పెదనాన్న వెళ్ళి శృంగేరీ శంకరస్వామిని ఆహ్వానించటము, ఆయన అంగీకరించి వారింటికి రావటము, వైభవోపేతంగా ఆ కార్యక్రమం జరగటము అన్నీ వారు చెప్పిన విధంగానే అయినాయి.

శారదాదేవి శృంగేరీ పీఠాధిపతులకు నమస్కారం చేసినప్పుడు ఆయన 'అమ్మాయికి మంచి భగవద్భక్తి ఉంది. ఈమెకు యోగులు. పుణ్య పురుషులు, మహనీయుల దర్శనమవుతుంది. లౌకికి చింతనలను విడిచి కలియుగంలో పరమేశ్వరావతార సేవతో తరిస్తుంది' అన్నారు.

ఒకసారి శారదాదేవి తన తండ్రి తాతలతో బదరీయాత్రకు వెళ్ళింది. అక్కడ బదరీలో ఒకచోట ఒక నాలుగు అంగుళముల చిన్న బంగారు కృష్ణ విగ్రహం ఆమెకు దొరికింది. బదరీలోనే ఆమె తండ్రి నుండి బాలగోపాల మంత్రమును ఉపదేశం పొందింది. ఆ మంత్రజప ప్రభావం చేత కూడా ఆమెకు కృష్ణభక్తి ఎక్కువయింది. 'నా గోపాలుడు, నా గోపాలుడు' అంటూ ఆమె ఆ చిన్న గోపాలుని బొమ్మను విడిచిపెట్టేదికాదు. ఆమె తనను తాను రాధగా ఊహించుకొని ఆ కృష్ణుణ్ణి తనివితీరా ఆరాధిస్తూ ఉండేది. ఆ నందనందనుడు ఎక్కడ కనిపిస్తాడా, ఎప్పుడు కనిపిస్తాడా అని తపించిపోయేది. ఆమెకు నదీతీరాలలో గోప గోపీ జనంతో తిరుగుతున్నట్లు, తామంతా గోపాలుని కోసం వెదుకుతున్నట్లు, ఋషిపత్నులతో యమునాతీరంలో ఎదురుచూస్తున్నట్లు దృశ్యాలు కనిపించేవి. ఆమె భక్తిని చూసి కొందరు ఆమెను రాధ అనికూడా పిలిచేవారు.

తరువాత శారదాదేవికి వివాహము జరగటము, వరుసగా ఆరుగురు పిల్లలు పుట్టిపోవడంతో ఆమెకు జీవితంపై విరక్తి కలిగింది. ఒకనాడు ఒక పంజాబు సాధువు ఇంటికి రాగా వారికి ఆతిథ్యమిచ్చి వారు ఎక్కడ ఉంటారో, ఏమిటో, వారి గురువు ఎవరో అడిగి తెలుసుకున్నది.

కొన్నాళ్ళ తరువాత శారదాదేవి ఆ సాధుపురుషుడు చెప్పిన ద్వారకాకొండలకు వెళ్ళటానికి నిశ్చయించుకుని, ముందు ఉజ్జయిని చేరి, అచ్చట నుండి ఓంకార క్షేత్రానికి పోయి అన్కడ ఒక నదిని దాటి, అరణ్యమార్గంలో అయిదురోజులు నడిచి, ఒక సొరంగం దాటి, చివరకు సిద్ధపురుషులు తపస్సు చేసుకొనే అద్భుతమైన తపోలోకానికి చేరుకున్నది.

అక్కడ బ్రహ్మజ్ఞానసంపన్నులైన తపస్సులు కనిపించారు. ముఖ్యంగా ఐదు గుహలలో ఐదుగురు గురువులు తపస్సమాధిలో ఉన్నారు. శారదాదేవి చెట్లక్రింద మూడు రోజులు జపం చేసుకొంటూ గడిపింది. నాలుగవనాడు సద్గురు మహరాజ్ తపస్వి వచ్చి 'వారిలో ఏ గురువు కావాలి నీకు?' అని అడిగారు. ఆ తపస్వికి 360 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు.

ఆ గుహలలో సమాధి స్థితిలో ఉన్న ఐదుగురిలో ఒకరిని ఆమె ఎన్నుకున్నది. అప్పుడు ఆ తపస్వి మహరాజ్ 'నీవు ఎన్ను కొన్న ఆ గురువు పేరు చంద్రయోగి!' అన్నారు.


బాబ్జి

## విద్యార్థులపై దృష్టి కేంద్రికరించడం వలన విద్యార్థుల విద్య ప్రమాణాలు మెరుగు పడుతున్నాయి

నంతగిరి, మండల పరిధిలో గల ఎగువశోభ పంచాయతీ ఎగువశోభ మండల పరిషత్ పాఠశాలలో సందర్శించిన అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు



అనంతగిరి, విజయభాను న్యూస్ : పాఠశాలలో ఉపాధ్యాయురాలు మణిమాల తో మాట్లాడుతూ పాఠశాల సమస్యలు అడిగి తెలుసుకొంటూ పాఠశాలలో ఉన్న 20 మంది విద్యార్థిని విద్యార్థులతో పుస్తకాలు చదించి గోడమీద చార్ట్ లో వ్రాసి ఉన్న అక్షరమాల ను చదివిస్తూ తెలుగు, ఇంగ్లీషులో చదించిన వారి వారి స్థాయిలో చదవగలిగారు. ఇది వరకు ఉపాధ్యాయుల కన్న ఇప్పుడున్న ఉపాధ్యాయుల శ్రద్ధ ఏకాగ్రత విద్యార్థులపై దృష్టి కేంద్రికరించడం వలన విద్యార్థుల విద్య ప్రమాణాలు మెరుగు పడుతున్నాయి. ఈ కార్యక్రమంలో సచివలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మౌలి,ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాక. నవీన్ డిజిటల్ అసిస్టెంట్ బి.మాధురి, మహిళ పోలీస్ మంజూ భార్గవి వాలింటిర్ పొట్టంగి. సన్యాసిరావు కాంగ్రెస్ యూత్ నాయకుడు పాంగి శాంతిరావు, గ్రామ పెద్దలు పాంగి.మద్దు,సొంటరి మూర్తి తదితరులు

## శిక్షణలో ఉన్న ఎంపీడీవోలతో సమావేశమైన ఎంపీపీ శెట్టి నీలవేణి



అనంతగిరి విజయభాను న్యూస్ : రాష్ట్రంలోని వివిధ మండలాల్లో ఇటీవల ఎంపీడీవోలుగా నియమితులై శిక్షణ పూర్తి చేసుకుంటున్న ఎంపీడీవోల బృందంతో ఎంపీపీ శెట్టి నీలవేణి శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. శిక్షణలో భాగంగా అరకులోయ పర్యటనకు వచ్చిన ఎంపీడీవోల బృందానికి చిలకలగెడ్డలో సాధారంగా స్వాగతం పలికిన ఎంపీపీ స్థానిక సచివాలయంలో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న అనంతగిరి ఎంపీడీవో హర్షిత్ రాజాం బృందంలో సభ్యులుగా ఉండడంతో అనంతగిరి మండలంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఎంపీడీవోలకు వివరించారు. ఏజెన్సీలో ఉన్న విభిన్న పరిస్థితుల్లో మండలాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను పరస్పరం చర్చించడం జరిగింది. మండల అభివృద్ధికి ఎంపీడీవో ఎంపీపీలు రెండు కళ్ళ వంటి వారిని రెండు సక్రమంగా ఉంటేనే మండలం అభివృద్ధి బాటలో వెళ్తుందని ఎంపీపీ శెట్టి నీలవేణి వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధులు అధికారులు పరస్పరం సహకరించుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.ఈ మేరకు మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అప్పారావు పంచాయతీ కార్యదర్శి లావణ్య వార్డు సభ్యురాలు గౌరీ సచివాలయ సిబ్బంది తదితరులు ఎంపీడీవో బంధానికి స్వాగతం పలికారు.

## జగనన్న భీమా కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ కన్వీనర్ గిరి రఘు



సాలూరు విజయభాను న్యూస్ సెప్టెంబర్ 22 : సాలూరు పట్టణంలో 29 వార్డులలో ఉన్న సచివాలయాల్లో జగనన్న భీమా కార్యక్రమం లో జేఏసీ పట్టణ కన్వీనర్ గిరి రఘు సందర్శించారు. సచివాలయం పరిధిలో ఉన్న వైయస్సార్ కుటుంబం, గృహ సారథి, జగనన్న బీమా ఆన్లైన్ లో తమ తమ మొబైల్స్ లో జెసిఎస్ సైన్యం ఏప్ డౌన్లోడ్ చేసి పేర్లు డీటెయిల్స్ మరియు నామిని పేరు ఎంటర్ చేశారా లేదా అని జేఏసీ కన్వీనర్ గిరి రఘు సచివాలయాలు ఒకటి నుండి 16వ సచివాలయం పరిధిలో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జర్జాపు సూరిబాబు,గులిపల్లి నాగేశ్వరరావు(నాగ) రాపాక మాధవరావు,గొర్లె వెంకటరమణ,పప్పల లక్ష్మణరావు,సాలూరు పట్టణ వైయస్సార్ పార్టీ మహిళా సంఘం అధ్యక్షురాలు రాంబాయి, గృహ సారథులు, తదితరులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కూరగాయలవ్యాపారి ఆత్మహత్య



యానం కేంద్రపాలిత ప్రాంతం యానం నియోజకవర్గం లో పేరొందిన ప్రముఖ కాయ గూరల వ్యాపారి మాగాపు వీరభద్రరావు వయస్సు (50) గురువారం అర్ధరాత్రి తన కాయ గూరల దుకాణం లోనే ఉరివేసుకొని ఆత్మచ్చుకు పాల్పడ్డాడు. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియనప్పటికీ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐషణ్ముఖం, ఎస్సై కట్ట సుబ్బరాజు తెలిపారు.

## స్థల యాజమానులు అప్రమత్తంగా ఉండండి

భూకబ్జాదారులకు సహకరిస్తున్న నగర ప్రణాళిక శాఖ అధికారులు
శివాలయం మాజీ చైర్మన్ కన్నా ఆరోపణ



కాకినాడ, సెప్టెంబర్ 22: కాకినాడ నగరంలో ఖాళీగా ఉన్నస్థల యజమానులు అప్రమత్తంగా ఉండాలని లేని పక్షం అవి కబ్జాకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయని కాకినాడ పెద్ద శివాలయం మాజీ చైర్మన్ రాజనాల విజయ సారధి (కన్నా) ఆరోపించారు. స్థానిక గుడారి గుంట మూడు గుళ్ల సెంటర్ ప్రాంతంలో తనతో పాటు కొందరికి సుమారు 4.40 ఎకరాల స్థలం ఉందని దానిపై కబ్జాదారుల కన్ను పడిందని అప్పటినుంచి తనను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ కబ్జా కోరులకు కాకినాడ నగరపాలకకు చెందిన ప్రణాళిక శాఖ అధికారులు సహకరిస్తున్నారని కన్నా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన తనకు చెందిన స్థలం వద్ద విలేకరులతో మాట్లాడారు. తనకు చెందిన స్థలంలో రక్షణ నిమిత్తం గోడ నిర్మించుకుంటున్నానని అది కట్టవద్దంటూ సుమారు ఐదు రోజుల క్రితం ప్రణాళిక అధికారులు వచ్చి ఆ స్థలం ప్రభుత్వంది అంటూ చెప్పారన్నారు. దీనిపై తాను తన దగ్గర ఉన్న ఆధారాలతో సహా అధికారులకు పత్రాలు అన్ని కూడా అందించానన్నారు. దానికి వారు సమాధానం చెప్ప చెప్పకపోగా తిరిగి తాను మళ్ళీ శుక్రవారం గోడ నిర్మించుకోవడానికి వస్తే నగర ప్రణాళిక అధికారులు సామాగ్రిని ధ్వంసం చేశారని చెప్పారు. కోర్టు కేసులో ఉన్నా ఎందుకు మీరు వచ్చారంటూ అడిగితే పొంతన లేని సమాధానాలను చెప్పారన్నారు.

ఈ భూమిపై భూకబ్జాదారుల కన్ను పడిందని అందుకే తనను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారని ఇది కూడా వైకాపా వారే కబ్జా చేయాలని చూస్తుండగా వారికి నగరపాలక అధికారులు సహకరిస్తున్నారన్నారు. దీనిపై ఈ విషయంపై కోర్టులో కేసు ఉన్నా దౌర్జన్యానికి దిగిన నగరపాలక ప్రణాళిక శాఖపై న్యాయపోరాటం చేస్తానని కన్నా చెప్పారు.

### ఈనెల 24న రారవేలో రెండు పుస్తకాలు ఆవిష్కరణ




రాజాం (విజయభాను న్యూస్) : రాజాం రచయితల వేదిక ఆధ్వర్యంలో రాజాంలో శ్రీ విద్యానికేతన్ పాఠశాల వద్ద ఈనెల 24న రెండు కొత్త పుస్తకాలు ఆవిష్కరించనున్నట్లు రారవే నిర్వాహకులు గార రంగనాధం శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి. రమేష్ పట్నాయక్ రచించిన 01) గతితార్కిక భౌతిక వాదం-ఒక పరిచయం, 02) డేవిడ్ హార్వే పెట్టుబడి- ఏడు ప్రాథమిక వైరుధ్యాలు-పరిచయం, ఇతర వ్యాసాలు అనే పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రమేష్ పట్నాయక్ తో పాటు అట్టాడ అప్పలనాయుడు, రౌతు గణపతిరావునాయుడు,లు ముఖ్య అతిధులుగా ఈకార్యక్రమంలో పాల్గొంటారని, రాజాంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు, కవులు, రచయితలు హాజరుకావాలని కోరారు.

### రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి




రాజాం (విజయభాను న్యూస్) : రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్ అమ్మవారి కాలనీలో వినాయక నవరాత్రులలో భాగంగా అమ్మవారి కాలనీ యువత చే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. చాలామంది ప్లేట్లెట్స్ తగ్గి రోడ్డు ప్రమాదాల్లోనూ అదేవిధంగా మహిళలు ప్రసవ సమయంలో రక్తం అందక తల సేమియా ఎనీమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం అవసరం అని ఇట్లాంటి సమయంలో అమ్మవారి కాలనీ యువత రక్తదానానికి ముందుకు రావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన పురస్కార గ్రహీత పెంకి చైతన్య కుమార్, ఆర్నెపల్లి వెంకట్ నాయుడు, పెంకి గౌరీశ్వరరావు , మహదాస్యం బాబ్జి , మహదాస్యం శ్రీను, లంక శ్రీహరి, ఉల్లాకలా నీలకంఠేశ్వర యాదవ్, జి.నీలకంఠేశ్వరరావు, రంగనాథం, కాలనీ యువకులు కార్తీక్, వాసు, మోహ మోహన్, స్వరూప్, శ్రీను,శేఖర్ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలకు రెడ్ క్రాస్ తరపున ప్రశంసా పత్రాలను అందజేశారు

## నష్టపరిహారం అర్హులైన వారందరికీ అందాలి

మల్లాడి సత్తిబాబు



యానం కేంద్రపాలిత ప్రాంతం యానం నియోజకవర్గం ఇటీవల ఓఎన్జిసి నష్టపరిహార విషయంలో అర్హులైన మత్స్యకారులందరికీ వేట నిషేధం పరిహారాన్ని అందరికీ అందేలా చూడాలని యానం మత్స్య శాఖ అధికారులు మల్లాడి సత్తిబాబు కోరారు.

శుక్రవారం ఉదయం డిపార్ట్మెంట్ కి వెళ్లి నష్టపరిహారం జాబితాలో లేని వారి పేర్లు ఎందుకు తొలగించారు చెప్పాలంటే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ఎంపీ వైద్య లింగం ఆధ్వర్యంలో ఈ పరిహార విషయంలో జాప్యం జరుగుతుందంటూ పుదుచ్చేరి సీఎంకు వినతి పత్రం అందజేస్తామని అర్హులైన వారందరికీ ఈ నష్టపరిహారాన్ని చెల్లించాలని, కొంతమంది పేర్లను కావాలని తొలగించారని వాటిపై చర్యలు తీసుకుని మత్స్యకారులందరికీ పరిహారం అందజేయాలని ఆనాడే కోరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాడి.బీరస్వామి, వెంకటేశ్వర్లు, దున్న చక్రవర్తి, తదితరులు వీరి వెంట ఉన్నారు.

## డ్రగ్స్, సెల్ ఫోన్లకు దూరంగా ఉండండి

– విజయనగరం వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు



విజయనగరం : విద్యార్థులు మత్తు పదార్థాలకు, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు సెప్టెంబరు 22న పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించేందుకు గాను విజయనగరం పట్టణంలోని ఆర్ కె జూనియర్ కళాశాల విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు మాట్లాడుతూ – విద్యార్థుల జీవితాలను నాశనం చేసే డ్రగ్స్, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే విచక్షణ కోల్పోయి, తామేమీ చేస్తున్నామన్న విషయం మరిచి, నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు కలిగించే గంజాయి, హెరాన్, నల్ల మందు, మద్యం, డ్రగ్స్ బారిన పడవద్దన్నారు. అదే విధంగా సెల్ ఫోన్లను అతిగా వినియోగించడం వలన విద్యార్థులు చెడు మార్గం పడుతున్నారన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకున్న, చక్కగా విద్య మీద దృష్టి పెట్టి, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు.

ఎవరైతే క్రమ శిక్షణతో నడుచుకొంటూ, ఉన్నతమైన చదువులతో ముందుకు వెళ్తారో వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఉన్నతమైన లక్ష్యాలతో మంచి స్థానాలకు చేరుకున్న వారికి సమాజంలో గౌరవం లభిస్తుందని, తద్వారా మీ తల్లిదండ్రులకు, మీరు నివసిస్తున్న ప్రాంతానికి, దేశానికి మంచి ఖ్యాతి లభిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, లక్ష్య సాధనకు కృషి చెయ్యాలని సిఐ బి.వెంకటరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ ఆర్ కె జూన్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వన్ టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణ స్వీకారం



సాలూరు విజయ భాను న్యూస్ సెప్టెంబర్ 22 : సాలూరు పట్టణ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవిల్లి సాంబశివరావు, కార్యదర్శి రాపాక నాగసాయి, బలబద్రుని శ్రీనివాసరావు, వారి ఆధ్వర్యంలో యువజన సంఘం అధ్యక్షులుగా ఇందుపూరి నారాయణరావు, పొట్ట మార్కండేయ మూర్తి, మాచర్ల వెంకట్రావు, 21 మంది కమిటీ సభ్యులుగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిని సాలూరు ఆర్యవైశ్య సంఘం వారు ఆర్యవైశ్య సంఘం పెద్దలు అభినందనలు తెలిపారు.

## మహా ధర్నా విజయవంతం చేయాలి

రాజాం (విజయభాను న్యూస్) : ఈనెల 25న విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నా విజయవంతం చేయాలని ఏ ఐ టియుసి జిల్లా నాయకులు ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, సిఐటియు నాయకురాలు బి ఉమా కుమారిలు కోరారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ప్రతినిధులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈనెల 25న విజయవాడలో మహా ధర్నా లో ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొంటారని , ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ , గ్రాడ్యుటో అమలు చేయాలని , దీర్ఘకాలికంగా ఉన్న అంగన్వాడీ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకురాలు ఎం శ్రీదేవీ, సిఐటియు నాయకురాలు విజయ్ కుమారి, సిహెచ్ మంగమ్మ , కళావతి తదితరులు పాల్గొన్నారు

# అధిక స్వేచ్ఛను పిల్లలకు ఇవ్వకూడదు



ఎంతో మంది పిల్లలు తల్లిదండ్రుల దగ్గర ఎక్కువగా గారాబంగా ఉండి కోన్ని విషయాలలో చేయారాని విషయాలు చేస్తుంటారు. తల్లితండ్రులనుంచి చాలా గారాబం పొందే పిల్లలకు ఏ నియమాలు కాని, నిరాశ కాని, వస్త్రధారణ నియమనిబంధనలు కాని మర్యాద కాని ఉండవని మీరు అనుకుంటారు. నిజమే, కాని వారు ఒక్కరే కాదు. మీ అలవాట్లలో కొన్నిటి మూలంగా మీరు గారాబం చూపించే తల్లితండ్రుల కేటగిరి క్రిందకు వస్తారు అంటే మీరు ఆశ్చర్యపోతారు, నిపుణుల ప్రకారం కూడా, మీరు మీ పిల్లల పట్ల చేస్తున్నది సరిఅయినదిగా భావిస్తుంటారని తెలుస్తున్నది.

చాలామంది తల్లితండ్రులు వారివారి పాత్రను తప్పుగా అర్థం చేసుకుంటున్నారు అని పేరెంటింగ్ ఎక్స్పర్ట్ లియోనార్డ్ సాక్స్, చెస్టర్ దేశం లోని ఫామిలి డాక్టర్, గర్ల్స ఆన్ ది ఎడ్జ్ అండ్ బాయ్స్ అడ్రిఫ్ట్' రచయిత చెపుతున్నారు. తమ పిల్లలని టాప్ కాలేజ్‌లో సీట్ సంపాయించటం వాళ్ల నిరాశకు గురి కాకుండా ఉండేందుకు మాత్రమే వారి పాత్ర ఉంటుందని చాలామంది తల్లితండ్రుల అభిప్రాయం. క్లిష్ట పరిస్థితులలో రక్షణ వలయంలాగా తల్లితండ్రులు ఉండాలి కాని పిల్లలని కూడా వాటి యొక్క పరిణామాలను తెలుసుకోగలిగే అవకాశాన్ని,తెలివిని పెంపొందించుకోని వ్వాలి. ఇక్కడ సాధారణంగా తల్లిదండ్రులు ఎందుకు, ఎలా పిల్లలని గారాబం చేస్తారో 5 పాయింట్లలో చెపుతున్నాం.

1. వివాదానికి దూరంగా ఉండటం చాలామంది తల్లితండ్రులు పిల్లలతో వాదనలు పెంచుకోవటం కన్నా వారి కోరికలని తీర్చటం సులభం అనుకుంటారు, ఫలి తంగా పిల్లలు తల్లి తండ్రులను అలుసుగా తీసుకుంటు న్నారు. ఈ విషయం చాలామంది తల్లితండ్రులలో చూస్తున్నాము. వారు పిల్లల పట్ల కఠినంగా ఉండటానికి ఇష్టపడరు.

2. స్కూల్ పని ఒక వంక స్కూల్ హోం వర్క్ సాకుతో చాలా మంది పిల్లలు ఇంట్లో వారి బాధ్యతలనుండి తప్పించుకుం టున్నారు ఎందుకంటే తల్లితండ్రులు చదువుకి సంబంధిం చిన విషయాలపట్ల చాలా శ్రద్ధ చూపిస్తారు. 3. పిల్లలని తమ స్నేహితులలాగా చూడటం కొంతమంది తల్లి తండ్రులు తమ పిల్లలని, అధికారికంగా కాకుండా స్నేహి తులలాగా ఉండాలన్న ప్రయత్నంలో చాలా గారాబం చేస్తారు. 4. నిత్యకృత్యాలు లేదా పరిమితులు లేవు చాలామంది తల్లితండ్రులకు పిల్లలని పెంచటంలో ప్రణాళిక లేకపోవ టం ఒక లోపంగా ఉంటున్నది.

దీనితో, వారి సంసారం లోనే క్రమశిక్షణ లేకపోవటం వలన పిల్లలు కూడా క్రమశిక్ష ణారాహిత్యంగా తయారవుతున్నారు. 5. టెక్నాలజీ పేరుతో పిల్లలకి బహుమతులు ఈ రోజుల్లో చిన్నవాళ్లకి చిన్న వయస్సున్న పిల్లలకి కూడా మొబైల్ ఫోన్ ఉంటున్నది ఎందుకంటే వారి తల్లితండ్రులను అడిగి, అలిగి మరీ తీసుకుంటున్నారు. కాని ఇది మంచిది కాదు.



# ఆరోగ్యం



## కొలెస్ట్రాల్ పై... కొన్ని అపోహాలు!



శరీరంలోని జీవక్రియలన్నీ సక్రమంగా జరగాలంటే అందుకు ప్రోటీనులు, విటమిన్స్, పోషకాంశాలు ఎంత ముఖ్యమో కొలెస్ట్రాల్ కూడా అంతే ముఖ్యం. శరీరంలోని జీవక్రియలు సక్రమంగా పనిచేయడానికి కొలెస్ట్రాల్ కూడా కావాల్సిన స్థాయిలో ఉండాలి. అదే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి అవసరానికి మించి పెరుగుతే అది ఆరోగ్యం మీద తీవ్రంగా చెడు ప్రభావాన్ని చూపెడుతుంది. *శరీరంలో అధనంగా కొలెస్ట్రాల్ పెరగడం వల్ల స్ట్రోక్ (మూర్ఛవ్యాధికి)కారణం అయ్యే బ్లాకేజ్ లు రక్తం ఏర్పడుతాయి. ఇంకా గుండె సంబంధిత సమస్యలు కూడా అధికంగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకు కారణం హై కొలెస్ట్రాలే. కొలెస్ట్రాల్ ను తరచూ అపార్ధం చేసుకొంటాం. మనలో ఉండే కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాలను పెంచుతుందనే సమాచారం కోకొల్లలుగా ఉంది. కాని దీనిలో చాల వరకు కేవలం కల్పితమే. అదెలాగో చూద్దాం..*

**కొలెస్ట్రాల్ గూర్చి మనలో ఉన్న తప్పుడు అపోహలు!**

అధిక కొలెస్ట్రాల్ కేవలం మగవారికి మాత్రమే సంబంధించినది- ఆడవారికి కాదు. స్త్రీల దగ్గర ఈస్ట్రోజెన్ ఉంది. ఇది కొలెస్ట్రాల్ మోతాదును సాధారణ స్థాయిలో ఉంచేందుకు సాయపడుతుంది. అయితే మెనోపాజ్ తర్వాత ఈ ప్రయోజనం ఉండదు. 45 దాటిన మగవారు, 55 దాటిన ఆడవారిలో కొలెస్ట్రాల్ వలన ప్రమాదం ఉంది.

అధిక కొలెస్ట్రాల్ అనేది జన్యుపరమైనది, దీనికి మనం చేయదగినది ఏది లేదు. జన్యువులు తప్పనిసరిగా తమ పాత్రను పోషిస్తాయి, అయితే ఆహార అలవాట్లు, జీవనశైలి విధానం కొలెస్ట్రాల్ స్థాయిపై ప్రభావం చూపిస్తాయి. మన కుటుంబంలో అధిక కొలెస్ట్రాల్ చరిత్ర ఉంటే, మీరు నివారణ చర్యలు చేపట్టి మీ మోతాదు స్థాయి మించకుండా చర్యలు చేపట్టండి.

**కొలెస్ట్రాల్ ను విజయవంతంగా ధ్యానం ద్వారా తగ్గించవచ్చు.** మీకు అధిక కొలెస్ట్రాల్ ఉందని తెల్సి నప్పుడు, కారణం తెల్సుకోవడం ముఖ్యం. తరచుగా మీరు కారకాలను సరిచేస్తుంటే, అది సాధారణ స్థితికి చేరుతుంది. కారణాలలో సరైన ఆహారంలేకపోవడం, తగినంత వ్యాయామం లేకపోవడం, అంటురోగాలు, మానసిక ఒత్తిడి, శారీరిక ఒత్తిడి ( సర్జరీ వంటివి) వంటివి ఉంటాయి.

కొలెస్ట్రాల్ తగ్గించే మందులను వాడినప్పుడు ఆహార అలవాట్లను మార్చవలసిన అవసరం లేదు లేదా ఎక్కువ చురుకుగా ఉండక్కరలేదు. కొలెస్ట్రాల్ ను తగ్గించే మందులు కొంత వరకు పనిచేస్తాయి. కాని మన గుండెకు మంచిదనుకొనే ఆహారాన్ని తీసుకొని, మన జీవన శైలిని మార్చినప్పుడు మీ మందులు బాగా పనిచేస్తాయి.

భోజనం గుండెకు - ఆరోగ్యం అంటే అర్థం 0 మి.గ్రా. కొలెస్ట్రాల్ పోషకాహార జాబితాలో మంచి కొలెస్ట్రాల్ అనే కొలెస్ట్రాల్ భాగం, మీ కొలెస్ట్రాల్ మోతాదును పై స్థాయికి తీసుకొని పోయే విషయ మౌతుంది. సాచ్యురేటెడ్ ఫాట్ (మాంసాహారం, డైరీ ఉత్పత్తులు) ట్రాన్స్ ఫాట్స్ (ప్యాక్ చేసిన ఆహారంలో ఉండేది) చాల వరకు తక్కువ సాంద్రత లిపోప్రొటీన్ పై పెద్దగా ప్రభావం ఉండదు, చెడు కొలెస్ట్రాల్ అనేది మంచి కొలెస్ట్రాల్ కంటే అతేరోస్కిరోసిస్ కు కారణమౌతుంది.

పిల్లలకు అధిక కొలెస్ట్రాల్ ఉండదు అతేరోస్కిరోసిస్ - ధమనులు కుచించుకొని పోయి గుండెజబ్బులకు దారి తీయడం - అనేది ఎనిమిదేళ్ళ చిన్న వయసు లోనే మొదలు కావచ్చని పరిశోధనలు తెలియచేస్తున్నాయి. అమెరికా పిడియాట్రిక్ అకాడమి వారు పిల్లలు, కొలెస్ట్రాల్ అనే విషయంపై సూచనలు చేస్తూ అధిక బరువు ఉన్న పిల్లలు, అధికరక్తపోటు లేదా కుటుంబంలో గుండెజబ్బుల చరిత్రను ఉన్నవారికి రెండేళ్ళ వయసులోనే కొలెస్ట్రాల్ పరీక్ష చేయించాలని తెలిపారు. అధిక కొలెస్ట్రాల్ ఉన్న పిల్లలు సంతృప్త కొవ్వు, ఆహార కొలెస్ట్రాల్ వరకు ఆహారపు అలవాట్లను పరిమితం చేసి, మరింత వ్యాయామం చేయమని సూచించారు.

భోజనం గుండెకు - ఆరోగ్యం అంటే అర్థం 0 మి.గ్రా. కొలెస్ట్రాల్ పోషకాహార జాబితాలో మంచి కొలెస్ట్రాల్ అనే కొలెస్ట్రాల్ భాగం, మీ కొలెస్ట్రాల్ మోతాదును పై స్థాయికి తీసుకొని పోయే విషయమౌతుంది. సంతృప్త కొవ్వు ( ాంసాహారం, డైరీ ఉత్పత్తులు) ట్రాన్స్ ఫాట్స్ (ప్యాక్ చేసిన ఆహారంలో ఉండేది) చాల వరకు తక్కువ సాంద్రత ఉన్న లిపోప్రొటీన్ పై పెద్దగా ప్రభావం ఉండదు, చెడు కొలెస్ట్రాల్ అనేది మంచి కొలెస్ట్రాల్ కంటే అతేరోస్కిరోసిస్ కు కారణమౌతుంది.

కొలెస్ట్రాల్ ఎల్లప్పుడు చెడ్డది చాలామంది కొలెస్ట్రాల్ అని విన్నప్పుడు అది చెడ్డది అనుకుంటారు. కాని అసలు విషయం చాల క్లిష్టమైనది. అధిక కొలెస్ట్రాల్ ప్రమాదకరం కావచ్చు. కాని కొలెస్ట్రాల్ శరీర ప్రక్రియలు జరగడానికి అత్యవసరం, మెదడు లోని నాడీ కణాలను ఉత్తేజితం చేయడం నుండి కణత్వచాలకు రూపాన్ని ఇవ్వడం వరకు పని చేస్తుంది. గుండె జబ్బులలో కొలెస్ట్రాల్ పాత్రను తప్పుగా అర్థం చేసుకుంటారు. కొలెస్ట్రాల్ రక్తనాళాల నుండి తక్కువ, ఎక్కువ సాంద్రత ఉన్న లిపోప్రొటీన్ ల ద్వారా రవాణా చేయబడుతుంది. ఎల్ డి ఎల్ అంటే చెడు కొలెస్ట్రాల్. ఇది అతేరోస్కిరోసిస్ కు కారణమౌతుంది అంతేకాని కేవలం కొలెస్ట్రాల్ కాదు.

తక్కువ కొలెస్ట్రాల్ ఎల్లప్పుడు మంచి ఆరోగ్యానికి సంకేతం తక్కువ స్థాయి ఎల్ డి ఎల్ కొలెస్ట్రాల్ సాధారణంగా ఆరోగ్యకరమైనప్పటికి, ఒక కొత్త పరిశోధన ప్రకారం సాధారణంగా అసలు క్యాన్సర్ రాని వారి కంటే క్యాన్సర్ వచ్చే వారిలో తక్కువ స్థాయి ఎల్ డి ఎల్ ను క్యాన్సర్ వచ్చే ముందు ఏళ్ళలో ఉన్నట్లు ఒక కొత్త పరిశోధనలో తెల్సుకున్నారు. రక్తంలో తక్కువ కొలెస్ట్రాల్ ఉన్న వారు అనేక వ్యాధులకు కూడా గురి ఔతారు. చాల కాలం వీటితో బాధపడి, ఈ వ్యాధితోనే చనిపోతారు.

అధిక కొలెస్ట్రాల్ ఉన్న లక్షణాలు కనబడటం లేదు అధిక కొలెస్ట్రాల్ ఉన్న వారిలో కొంతమందికి పసుపు - ఎరుపు గ్జంతోమస్ అనే గడ్డలు కనురెప్పలు, కీళ్ళు, చేతులు, శరీరంలోని ఇతర భాగాల మీద వస్తాయి.

మధుమేహం లేదా అనువంశికంగా ఫామిలియాల్ హైపర్ కొలెస్ట్రోలేమియా ఉన్నవారిలో ఈ గ్జంతోమస్ సాధారణంగా ఉంటుంది. మీకు అధిక కొలెస్ట్రాల్ ఉన్నదా లేదా అనే విషయం తెల్సుకోవడానికి మంచి మార్గం, మీ ఆరోగ్యాన్ని పరిరక్షకులు సలహా ఇస్తే మీకు 20 ఏళ్ళు వచ్చినప్పటి నుండి ప్రతి మూడేళ్ళ కొకసారి కొలెస్ట్రాల్ ను పరీక్షించుకోవాలి లేదా మీ డాక్టర్ సలహా ఇస్తే తరచు పరీక్ష చేయించుకోవాలి.

కొలెస్ట్రాల్ స్థాయి తగ్గితే మందులను వాడటం ఆపేయవచ్చు. మీ కొలెస్ట్రాల్ మందులను వాడటం ఆపేస్తే, మీ చెడు ఎల్ డి ఎల్ కొలెస్ట్రాల్ బహుశ తిరిగి అది ఉన్న చోటుకే రావచ్చు. మీ కొలెస్ట్రాల్ మోతాదు మించితే, మీ గుండె జబ్బులు, పోటు పరిస్థితి కూడా అంతే. అధిక కొలెస్ట్రాల్ ను నయం చేయలేనప్పుడు, ఇలా వాడకం విజయవంతంగా నిర్వహించవచ్చు. కొలెస్ట్రాల్ నిర్వహణ మీ జీవిత కాలమంతా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుకోవడానికి అవసరం - ప్రతి రోజు వాడే మందులతో సహా.

అధిక కొలెస్ట్రాల్ సన్నగా ఉండే వారిలో పెద్ద సమస్యేమి కాదు సన్నని, అధిక బరువు, లేదా మధ్య రకం ఎవరైనా సరే తమ కొలెస్ట్రాల్ ను తరచూ పరీక్షించుకోవాలి. అధిక బరువు ఉన్న వారు ఎక్కువ కొవ్వు ఉన్న ఆహరం తీసుకోరాదు. అలాగే త్వరగా బరువు పెరగని వారు ఎంత సంతృప్త కొవ్వులు తింటున్నామో చూసుకోవాలి.

వెన్న కాకుండా వనస్పతిని వాడట0 వలన కొలెస్ట్రాల్ తగ్గుతుంది. వనస్పతిలో, వెన్న లాగే కొవ్వు ఎక్కువగా ఉంటుంది - మీకు అధిక కొలెస్ట్రాల్ ఉంటే అన్ని కొవ్వు ఆహారాలు మితంగా తినాలి. చాలావరకు వనస్పతిలో అధిక కొలెస్ట్రాల్ కు కారణమైన ఒక ప్రధాన సంతృప్త కొవ్వులు ఉంటాయి. సూచించబడిన ఎంపికలో ఒక ద్రవరూపంలోని విజిటబుల్ నూనె లేదా ఏ రకమైన ట్రాన్స్ కొవ్వులు లేని నూనె (హైడ్రోజనేటేడ్ విజిటబుల్ నూనె) ఉన్నాయి.

మీరు మధ్య వయస్సు వారయ్యే వరకు మీ కొలెస్ట్రాల్ ను చూపెట్టుకొనే అవసరం లేదు పిల్లలు అయినప్పటికీ - గుండె జబ్బుల కుటుంబ చరిత్ర ఉన్నవారు - అధిక కొలెస్ట్రాల్ స్థాయిని కల్గి ఉండవచ్చు.

చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ స్థాయిని పరీక్షించుకోవడం ఒక మంచి ఆలోచన.



## గ్రీన్‌టీలో ... ఔషధ గుణగణాలు

పొద్దున్నే టీ కప్పు కనిపిస్తే మనిషికి ఉదయించే సూర్యుణ్ణి చూసినంత ఆనందం కలుగుతుంది. టీ మాధుర్యాన్ని చవి చూసిన ఆనందంలో కొందరు పాలు కలపడానికి కూడా ఇష్టపడక ఏకంగా బ్లాక్ టీనే తాగడం మొదపుట్టారు. ఈ క్రమంలోనే ఇటీవల గ్రీన్ టీ పట్ల మోజు బాగా పెరుగుతోంది. ఆరోగ్యపరమైన ఎన్నో సమస్యలకు గ్రీన్ టీ మంచి ఔషధంలా పనిచేస్తుంది. అందుకే దీన్ని తీసుకునేవారి సంఖ్య ఇటీవల బాగా పెరుగుతోంది. గ్రీన్ టీలోని విశేషాలను, ఔషధ గుణాలను మరింత లోతుగా పరిశీలిస్తే.... గ్రీన్ టీని తయారుచేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. టీ ఆకులో ఉండే సహజమైన ఆకుపచ్చదనాన్నీ, పరిమళాన్నీ నిలబెట్టే ప్రయత్నం ఈ తయారీలో ఉంటుంది. నిజానికి పూర్వకాలం నుంచే గ్రీన్ టీ వినియోగం ఉంది. అయితే, ఇప్పుడు ఆ ప్రాచీన విజ్ఞానానికి కొంత ఆధునిక అవగాహన జత చేయడం ద్వారా గ్రీన్ టీ ప్రయోజనాలు రెట్టింపు అవుతున్నాయి. వ్యాధి నిరోధక శక్తి కలిగిన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండడం గ్రీన్ టీలోని ఒక ప్రధాన విశేషం. బరువు తగ్గించడంలో అద్భుతమైనది మార్గం గ్రీన్ టీ, గ్రీన్ టీ డైట్ వల్ల శరీరంలోని అనేక వ్యాధులు క్యాన్సర్, రక్తంలోని హై కొలెస్ట్రాల్ లెవల్స్ మరియు డయాబెటిస్ వంటివి అనేక రుగ్మతలను నివారించడంలో అద్భుతమైన మార్గం గ్రీన్ టీ డైట్. మరి మీ డైట్ లో గ్రీన్ టీ తీసుకోవడం వల్ల కలిగే అనేక ప్రయోజనాలేంటో ఒక సారి చూద్దాం...

**1. వేగగంగా బరువు తగ్గిస్తుంది** : గ్రీన్ టీ లో ఉన్న యాంటీఆక్సిడెంట్లు ముఖ్యంగా, ఉదరంలో ఉన్న శరీరాన్ని ఉత్తేజపరిచే కాలరీలను తగ్గించి బరువు తగ్గించి, శరీరంలోని కొవ్వును తగ్గిస్తుంది.అధికబరువుతో బాధ పడేవారికి 'గ్రీన్‌టీ' ఓ చక్కని పరిష్కారం. కొవ్వును తగ్గించడంలో 'గ్రీన్‌టీ' చాలా ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. ఉరుకులు, పరుగుల జీవితంలో అధికబ రువుతో అనారోగ్యాల పాలవుతున్న వారికి 'గ్రీన్‌టీ' దివ్యౌషదం అని చెబుతు న్నారు. **2. డయాబెటిస్‌ను దూరంగా ఉంచుతుంది** : డయాబెటీస్ బాధితులకు ఇది ఎంతగానో ఉ వ యో గ వ డు తుంది. ప్రాథమిక ధశలో ఉంటే ఈ 'టీ' మంచి ఫలితాలను ఇస్తుంది. బ్లడ్‌షుగర్ బాధితులకు కూడా ఎంతో మేలు చేస్తుంది. **3. కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది:** గ్రీన్‌టీలో మెం డుగా వున్న రెస్‌పెర్రటాల్ అనే పదార్థం శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను అదుపులో వుంచుతుంది. దీనితో, రక్తనాళాలలో చెడు కొలెస్ట్రాల్ వలన రక్తం గడ్డకట్టిపోదు. తద్వారా గుండెపోట్ల వంటివి నివారించబడతాయి. **4. క్యాన్సర్‌ను నిరోధిస్తుంది:** (టీ లో కనిపించే యాంటీఆక్సిడెంట్లు) టీ లోని పాలీఫేనాల్స్ వల్ల, ఒక కప్పు టీ లో కాన్సర్ ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. అయితే పరిశోధన అసంపూర్తిగా ఉన్నప్పటికీ, టీ లో పాలీఫేనల్స్ అధికంగా ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి, ముఖ్యంగా కాటచిన్స్, కాన్సర్ నివారణకు సంబంధించిన జీవకార్యకలాపాలను కలిగి ఉండవచ్చు. **5. దంత సమస్యలను నివారిస్తుంది:** టీ లో సహజమైన ఫ్లోరైడ్లు, దంతక్షయాన్ని నివారించడానికి సహాయపడే రసాయనాలు స్వల్ప పరిమాణంలో కలిగిఉంటాయని ఆమె చెప్పారు. ఫ్లోరైడ్ లాలాజలంతో కలిసినపుడు, బాక్టీరియా కావిటీస్ ప్రోత్సహించే ఉత్పత్తులుగా ఆమ్లాలను ఉత్పత్తి చేయదు. అదనంగా, ఫ్లోరైడ్ ప్రారంభ దశలో ఉన్న దంతక్షయాన్ని నివారించడానికి పనిచేస్తుంది. **6.వ్యాధినిరోధకతనుమెరుగుపరుస్తుంది:** ఈ గ్రీన్‌టీ' రోగనిరోధక శక్తిని పెంచుతుంది. **7. ఆర్థరైటిస్ (కీళ్ళనొప్పుల)ను మాయం చేస్తుంది:** బోన్‌వూఫాక్చర్ అయినప్పుడు గ్రీన్‌టీ ఎంతో లాభదాయకం, తిరిగి ఆరోగ్యకరమైన ఎముకల నిర్మాణం జరుగుతుంది. బోన్స్ పటిష్టంగా, దృఢంగా తయారవుతాయి.

**8. బ్యూటీ బెనిఫిట్స్:** గ్రీన్‌టీ తీసుకోవడం వల్ల కాంతివంతమైన చర్మం కూడా మీ సొంతం అవుతుంది. ఇది పూర్తిగా ప్రకృతి సిద్ధమైనది కావడంతో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స ఉండవు. ప్రతిరోజు 2 నుంచి 5 కప్పుల 'గ్రీన్‌టీ' తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. గ్రీన్‌టీలో ఉండే బలమైన యాంటి ఆక్సిడెంట్లు వృద్ధాప్యాన్ని కొంతమేరకు నిలుపుచేస్తాయి.

శరీరంలోని డిఎన్ఎ దెబ్బతినకుండా నిరోధించడం ద్వారా వృద్ధాప్యాన్ని ఆలస్యం చేస్తుంది. చర్మం ముడుతలు పడటం తగ్గిస్తుంది.

## కూర్చోవడం ఎలా?

మనం కూర్చుంటున్న విధానాల గురించి ముందు పరిశీలిద్దాం. మన చుట్టూ కొన్ని వందల సంవ త్సరాల నుంచి రకరకాల కుర్చీలువస్తున్నాయి. కానీ అన్ని కుర్చీల్లోనూ కూర్చోవటం ఎంతవరకు మంచిది? చాలామంది రోజులో గంటల కొద్ది సమయాన్ని కూర్చో వడానికే కేటాయిస్తారు. అది పనిప్రదేశంలో కావచ్చు, ఇంటిదగ్గర కావచ్చు. వాహనంమీద కావచ్చు - ఎక్క డైనా సరిగ్గా కూర్చోకపోతే వెన్ను మీద అదనపు భారం పడుతుంది. దాంతో వెన్నునొప్పి వచ్చి మనల్ని బాధ పెడుతుంది. గుంటలా ఉండి వెనుక కొంతవరకు అను కోవడానికి ఉపయోగించే కుర్చీలు మనకి సౌకర్యంగా అనిపించవచ్చు. కానీ వాటివల్ల కూర్చున్నప్రదేశంలో ఇబ్బంది లేకపోయినా వెన్నుమీద ఒత్తిడి పడవచ్చు. మెడవరకు కుర్చీలో తిన్నగా ఆనుకోవడానికుంటే వెన్ను అంతగా ఇబ్బంది పడకపోవచ్చు. ముందుకి ఒంగి కూర్చోవటం వల్ల కడుపు ప్రాంతంలో ఒత్తిడి కలుగవచ్చు. ఇక్కడ కనిపిస్తున్న బొమ్మని చూడండి ఆభంగిమ గురించి తెలుసుకోండి. -మొదటిది నడుం మీద ఒత్తిడి పడుతుంటుంది. వెన్నుమీద, ప్రేగుల మీద, కడుపుమీద, మూత్రపిండాల మీద, ఎడ్రిన ల్గ్లాండ్స మీద, ఉదరవితానం మీద, ఛాతిమీద, మెడ, గొంతుల మీద కూడా ఒత్తిడి పడవచ్చు. దంతాల మీద కూడా ఒత్తిడి పడవచ్చు. దానిని నివారించడం అవసరం. పొట్టకి, తొడకి మధ్య కనీసం 135 డిగ్రీలు ఉండాలి. అలాగే తొడభాగం అంతటికి, కింద పూర్తి ఆధారం ఉండాలి. రెండు పాదాసలూ నేలకు ఆనాలి. నడుంకి కూడా ఆధారం ఉండాలి. ఇలాంటి కూర్చోవడానికి వీలున్న కుర్చీలు మంచిది. ఎదురుగా కంప్యూటర్ గాని, టీవిగాని ఉంటే కళ్ళస్థాయి కంప్యూట్ లేక టీవి పై స్థాయికి సమంగా ఉండాలి. కాళ్ళని క్రాస్‌చేసి కూర్చోవడం, అలాగే చతికిల బడి కూర్చోవడం మంచిది కాదు. కూర్చున్నప్పుడు తొడకంటే మోకాలు పైకి ఉండకూడదు. ఇందాక చెప్పినట్లు 135 డిగ్రీలు ఉండేట్లు తప్పక చూసుకోవాలి. ఇలా ఇంటిదగ్గరె%నా, కార్యాలయాలలో అయినా మంచిది. కారులో కూర్చు న్నప్పుడు కూడా ఈ పద్ధతినే అవలంభించాలి.

ఇంట్లో కొంతమంది పొడుగాటి వాళ్ళు ఉండొచ్చు, కొంతమంది పొట్టివాళ్ళు ఉండవచ్చు. కానీ కుర్చీలు కొనేటప్పుడు పొట్టివాళ్ళను బేస్ చేసుకొని కొంటే మంచిది.

# యువతలో సేవాభావానికి ఎన్ఎస్ఎస్ కీలక భూమిక

## ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** గాంధీ మహాత్ముని శతజయంతి ఉత్సవాలలో భాగంగా 50 సంత్సరాల క్రిందట దేశంలో ప్రారంభం అయిన జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) యువతను సమాజ సేవకులుగా చైతన్య పరచడంలో కీలక భూమిక వహిస్తోందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మన చుట్టూ ఉండే ప్రజల సమూహమే సమాజమని, ప్రజల ఎదుర్కొనే చిన్న సమస్యలపై స్పందించి సహాయపడగలగడం సామాజిక బాధ్యత అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఏజ్‌కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టి డాక్టర్ ఎన్.ఎస్.రాజు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా యువతలో సమాజం పట్ల అవగాహన, సమస్యలను అర్థం చేసుకునే తత్వం, నాయకత్వలక్షణాలు, బృందాలుగా పనిచేసే సామర్థ్యం పెరుగుతాయన్నారు. పుస్తకాలు ద్వారా తెలుసుకునే విజ్ఞానంతో పాటు సమాజం నుంచి తెలుసుకునే పరిజ్ఞానం జీవితానికి ఉపయోగపడుతుందన్నారు. ఎంపిక, ప్రజలలో వివిధ అంశాలపై అవగాహన పెంచడానికి వలంటీర్లు ఏ విధంగా ప్రణాళికతో ముందుకు సాగాలి అనే అంశాలను వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ గీతంలో 22 ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా రెండు వేల మందికి పైగా వలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గోనడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పిల్లలలో సోషకాహార లోపాలను గుర్తించడం, పల్స్‌పోలియో, ప్లాస్టిక్ నిషేదం వంటి అంశాలను ఎంచుకుని ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. సేవాభావం గల యువతను ప్రోత్సహించడానికి కార్పోరేట్ రంగం ఆసక్తి కనబరుస్తోందని ఆయన తెలిపారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సంఖ్యను రానున్న కాలంలో రెండింతలుగా పెంచుతామని సమీప గ్రామాలను, ప్రభుత్వ పాఠశాలలను దత్తత స్వీకరించి పోషకాహార లోపాలను అధిగమించడం, వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్, గ్రామీణ అభివృద్ధికి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లు పాల్గోన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను, వలంటర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ వలంటీర్లకు సర్టిఫికేట్స్‌ను ఏజ్‌కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టి డాక్టర్ ఎన్.ఎస్.రాజు, స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ అనితారావు అందజేశారు.

# అసెంబ్లీకి రెండో రోజూ పాదయాత్రగా వెళ్లిన తెదేపా ఎమ్మెల్యేలు



అమరావతి: తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రెండో రోజూ అసెంబ్లీకి పాదయాత్రగా వెళ్లారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ నిరసన తెలుపుతూ తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి అసెంబ్లీ వరకు నడిచివెళ్లారు. అసెంబ్లీ సమావేశాల రెండోరోజు చంద్రబాబు అరెస్టు అక్రమం అనే అంశంపై పట్టుబడతామని తెలుగుదేశం స్పష్టం చేసింది. అధికారపక్షం ఎంత దుందుడుకుగా వ్యవహరించినా వెనక్కి తగ్గకూడదని.. శాసనమండలిలోనూ ఇలాగే వ్యవహరిస్తామని తెదేపా నేతలు వెల్లడించారు. స్కిల్ డెవల్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు ప్రభుత్వానికి స్పీకర్ అనుమతిస్తే తమకూ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేయాలని నిర్ణయించారు.

చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని.. సీఎం జగన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలనే అజెండాతోనే సభకు వెళ్లారు. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే అంశాన్ని సభలో లేవనెత్తాలని తెదేపా శాసనసభాపక్షం నిర్ణయించింది.

# స్థాయి సంఘం సమావేశంలో అన్ని అంశాలు ఆమోదం

## - నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయి సంఘ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం అజెండాలో 20 అంశాలు, ఒక టేబుల్ అజెండా తో మొత్తం 21 అంశాలు పొందుపరిచారని, అందు అన్ని అంశాలు సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారని చైర్పర్సన్ తెలిపారు. ఇంజనీర్ విభాగానికి సంబంధించి సుమారు రూ.477.93 లక్షల పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి సుమారు రూ.86.58లక్షలు ఆమోదం తెలిపారని, రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు, పొడిగింపులు తోపాటు తదితర అంశాలను ఆమోదించారన్నారు.

ఈ సమావేశంలో స్థాయి సంఘ సభ్యులతో పాటు ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవ రావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసి(రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి పి నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, ఎస్ వి రమణ, శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ కార్యనిర్వాహక ఇంజనీరు ప్రసాద బాబు, శేఖర్, ఏఎంఓహెచ్ సత్యనారాయణ, బయాలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్యులను అభినందించిన అధికారులు



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఆచార్యులుగా పురస్కారాలు సాధించిన ఆచార్యులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. తన కార్యాలయంలో ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఆచార్య పి.శ్యామల, ఆచార్య సి.వి నాయుడు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలిత భాస్కరిలను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అమలు జరగని రిజర్వేషన్లకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలా?

## - ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు లేవా? - మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



అనకాపల్లి (విజయభాను న్యూస్) : పల్లి నుంచి అమలు జరుపుతారని ఆశించిన మహిళా రిజర్వేషన్లు 2020 నుంచి అమలు జరుగుతాయా లేక 2034 నుంచి అమలు జరుగుతాయా అనేది తెలియదు. ఆ నాటికి ఏ ప్రభుత్వం అమలు జరుపుతుందో తెలియదు. దీనికోసం ఇంత ఆదరాబాదరాగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం జరపడం పెద్ద ఫార్స్ అని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పత్రికా సమావేశంలో అన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు చిత్తశుద్ధితో ఆమోదించింది కాదు. దీనిని 2024 నుంచి అమలు జరపడానికి జనాభా లెక్కలు, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన కమిటీలు అవసరం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళల జనాభాను పరిగణలోకి తీసుకుని వచ్చే ఎన్నికల నుంచే అమలు జరపవచ్చు. పెద్ద నాయకుల నియోజకవర్గాలు ఎక్కడ మహిళలకు రిజర్వు అయిపోతాయో అనే భయంతోనే నిరవధిక వాయిదా చట్టాన్ని ఆమోదించడం దేశంలోని మహిళలను మోసగించడానికే. ప్రస్తుతం దేశంలో ప్రజామోదం. ఉన్న ప్రధాని మోదీ ఇటువంటి అవసవ్య బిల్లును ఆమోదించడం అవసరమా? అమలుకు సమయ నిర్దేశం లేని ఈ బిల్లులో మహిళల కోటాలో ఓబీసీలు, మైనారిటీలకు 33 శాతం అంతర్గత రిజర్వేషన్లను ఎందుకు పెట్టలేదు? మళ్లీ ఎప్పుడో మరోసారి రాజ్యాంగ నవరణ చేస్తారా? మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉన్నప్పుడు ములాయంసింగ్ యాదవ్. లాలూ ప్రసాద్ యాదవ్ లాంటి నాయకులు ఓబీసీలకు అంతర్గత రిజర్వేషన్లు పెట్టాలని డిమాండు చేయడం వల్ల రాజ్యసభలో ఆమోదించిన మహిళా బిల్లు లోక్సభలో అడుగు పెట్టలేకపోయింది. ఇప్పుడు పార్టీలు ఓబీసీలకు రిజర్వేషన్లు పెట్టడానికి అంగీకరించినప్పుడు కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు స్థానం ఇచ్చేందుకు ఎందుకు నిరాకరించారు? ధనికులతో పోరాడలేని సాధారణ ఓబీసీ మహిళలకు రాజ్యాంగ సవరణ ద్వారా చట్టసభల్లో స్థానం ఇవ్వరా? 75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో ఓబీసీ మహిళలకు సామాజిక న్యాయం అందించరా? పార్లమెంటు ఆమోదించిన మహిళా బిల్లు ప్రకారం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2004 ఎన్నికల నుంచి అమలుచేయండి. లేదా ఓబీసీలకు 33 శాతం అంతర్గత రిజర్వేషన్లు కల్పిస్తూ వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ రాష్ట్రపతికి, ప్రధానికి, కేంద్ర హెూం మంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు లేఖలు రాశారు.

# సీఎం జగన్ కు ఎమ్మెల్సీ వంశీకృష్ణ ధన్యవాదములు

- యాదవకుల భవనానికి స్థలం కేటాయించిన సీఎం
- బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్న వైసీపీ ప్రభుత్వం
- శాసనమండలి లో సభాఅధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్





అమరావతి (విజయభాను న్యూస్): సీఎం వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని సచివాలయం ప్రాంగణంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ నగరం ఎండాడలో యాదవ్ కులస్తుల భవన నిర్మాణం కొరకు స్థలం కేటాయించి, గత 10 సంవత్సరాల క్రితం విశాఖ లో ఇచ్చిన మాట ప్రకారం స్థలం కేటాయించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. మాట తప్పని నేత అంటూ ఎమ్మెల్సీ వంశీకృష్ణ సీఎం జగన్ కు అభినందనలు తెలియజేశారు. స్థలం కేటాయింపులకు సహకరించిన వైసీపీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం శాసనమండలి ఛైర్ పర్సన్ ప్యానెల్ సభ్యులైన ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ శాసనమండలిలో సుమారు గంట పాటు సభాధ్యక్షత వహించారు.సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలును సంబంధింత మంత్రి ద్వారా తెలియపరిచారు.

# తొలి వన్డేలో టీమిండియా సూపర్ విక్టరీ



ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు అద్భుత విజయం సాధించింది. ఉత్కంఠ పోరులో కంగారూలను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. దాంతో, మొహాలీ స్టేడియంలో ఆసీస్‌పై 13 ఏళ్ల తర్వాత గెలుపొందింది. 277 ఛేదనలో ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(74 :63 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్(71 : 77 బంతుల్లో 10 ఫోర్లు) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత కెప్టెన్ రాహుల్(56 నాటౌట్), ఆసీస్‌పై వరుసగా మూడుసార్లు గోల్డెన్ డక్ అయిన సూర్యకుమార్ యాదవ్(50) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలుపు వాకిట నిలిపారు. ఈ విజయంతో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. విలువైన ఇన్నింగ్స్ ఆడిన రాహుల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపియ్యాడు. ఆస్ట్రేలియా నిర్దేశించిన 277 పరుగుల చేధనలో భారత ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(74), రుతురాజ్ గైక్వాడ్(71) ధాటిగా ఆడారు. ఇద్దరూ హాఫ్ సెంచరీలతో తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 142 పరుగులు జోడించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com